వైఎస్ఆర్-అన్నమయ్య వార్త

తెలుగు జాతీయ దినపత్రిక

మంగళవారం 24 జూన్ 2025

రేపు జగన్ సమక్షంలో సుగవాసి బాలసుబ్రమణ్యం వైసీపీలో చేరిక

రాజంపేట జూన్23 ప్రభాతవార్త

మాజీ ఎంపీ స్వర్గీయ సుగవాసి పాలకొండ్రాయుడు తనయుడు బాలసుబ్రమణ్యం వైసీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. బుధవారం తాడేపల్లిలో జగన్ సమక్షంలో వైసిపి తీర్థం పుచ్చుకోనున్నట్లు తెలియజేశారు. గత పదేళ్ళుగా పార్టీ మారే విషయం ఆలోచిస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే తన తండ్రి మరణం తర్వాత ఈ పరిస్థితి వస్తుందని ఊహించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ మారేందుకు గల కారణాలను పలుమార్లు తన తండ్రితో చర్చించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం తాను ఒక్కడినే వైసిపిలో చేరుతున్నట్లు చెప్పారు. వైసీపీలో చేరిన తర్వాత తాను వైసిపిలో చేరేందుకు దారి తీసిన పరిస్థితులను తన వర్గీయులకు తెలియజేసి ప్రజాక్షేత్రంలో పర్యటిస్తానని పేర్కొన్నారు. కాగా బాలసుబ్రమణ్యం గత ఎన్నికల్లో రాజంపేట అసెంబ్లీ అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేసి ఓడిపోయిన విషయం తెలిసిందే. ఇటీవలే ఆయన టిడిపికి రాజీనామా కూడా చేశారు. వైసిపి అధినేతలతో సుదీర్ఘ మంతనాల తర్వాత కుదిరిన ఒప్పందం మేరకే ఆయన పార్టీలో చేరుతున్నట్లు సమాచారం.

ఐఐఐటికి ఎంపికైన

ఉన్నత పాఠశాల విద్యార్థిని రెడ్డి నిత్యా

చిట్వేలి, జూన్ 23, ప్రభాతవార్త:

చిట్వేలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఒంగోలు ట్రిబుల్ ఐటీ కళాశాలకు కరణం రెడ్డి నిత్య ఎంపికైనట్లు బాధ్య ప్రధానోపాధ్యాయులు దుర్గరాజు తెలిపారు. సోమవారం తాను మాట్లాడుతూ చిట్వేలి గ్రామానికి చెందిన పాత్రికేయుడు కరణం వెంకటసుబ్బయ్య, హైమావతి ల కుమార్తె రెడ్డి నిత్య సోమవారం వెలువడిన జాబితాలో ఈ డబ్ల్యూ ఎస్ విభాగంలో ఎంపికయ్యారన్నారు. విద్యార్థిని ఎంపిక పట్ల హెచ్ఎం దుర్గరాజు, అధ్యాపక సిబ్బంది తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. రెడ్డి నిత్యాను అభినందించారు.

జగన్‌కు మానవత్వం లేదా ? ప్రాణం పోతున్నా వెళ్ళిపోతారా?

టిడిపి జిల్లా అధ్యక్షుడు జగన్ రాజు ధ్వజం

రాజంపేట జూన్23 ప్రభాతవార్త

మానవత్వం లేని వ్యక్తి నాయకుడా, ప్రజల ప్రాణాలు పోతుంటే పట్టించుకోరా, కార్యకర్తలను రెచ్చగొట్టి వారి జీవితాలను నాశనం చెయ్యడమే లక్ష్యమా, ఇదేనా ఒక మాజీ ముఖ్యమంత్రికి ఉండాల్సిన లక్షణాలు అని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు చమ్మర్తి జగన్మోహన్రాజు ధ్వజమెత్తారు. వైసిపి అధినేత వ్యవహార శైలిపై విరుచుకుపడ్డారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రాణం పోతుందని ప్రాధేయపడినా పట్టించుకోకుండా వెళ్లడం దారుణమన్నారు. మానవత్వం మరిచి, ప్రాణానికి విలువ ఇవ్వకుండా చేసే నేతకు ప్రజల పట్ల బాధ్యత ఏమి తెలుస్తుందని ప్రశ్నించారు. నమ్ముకున్న వారికి భరోసా ఇవ్వలేనీ నాయకుడు జగన్ అని విమర్శించారు. ఇద్దరు చనిపోయినా కనీస పశ్చాతాపం లేని వ్యక్తి నాయకుడా, చనిపోయారని తెలిసీ కనీసం పరామర్శించడం కూడా జగన్ చేయలేదంటే అంతకంటే దారుణం ఏముందని అన్నారు. గంజాయి, బ్లేడ్ బ్యాచ్లకు పరామర్శలు యాత్రలా ఇదెక్కడి రాజకీయ పోకడని ప్రశ్నించారు. హత్యా , శవ రాజకీయాలతో సాధించేదేమిటన్నారు. కార్యకర్తల కంటే గంజాయి బ్యాచే ముఖ్యమా అన్నారు. చనిపోయిన వారిని పక్కకు ఈడ్చి జేజేలు కొట్టించుకోవడం నాయకుని లక్ష్యమా అని ప్రశ్నించారు. కార్యకర్తల బెదిరింపులను కూడా సమర్థిస్తున్న సైకో ను ప్రజలు గమనిస్తున్నారని విమర్శించారు. జగన్ ప్రచార ఆర్భాటానికి వృద్ధుడు బలయ్యాడని ఆలోచన ఆవేదన వ్యక్తం చేశారు. కాపాడి సకాలంలో వైద్యం అందించి ఉంటే బతికేవాడు కదా అన్నారు. ప్రమాదంపై పశ్చాతాపం లేకుండా దిగజారుడు రాజకీయాలా అని ధ్వజమెత్తారు. సొంత బాబాయ్ నే లేపేసినోడికి ప్రజలు ఒక లెక్కా అన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పట్టణ టిడిపి అధ్యక్షుడు దగ్గుపాటి సుబ్రహ్మణ్యం నాయుడు, టిడిపి నాయకులు బాపనయ్య నాయుడు, క్లస్టర్ ఇంచార్జ్ కొల్లి రెడ్డయ్య నాయుడు, పసుపులేటి ప్రవీణ్ కుమార్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరు వేణుగోపాల్, పోలి చెరువు ప్రెసిడెంట్ నాగినేని నాగేశ్వరరావు, ప్రొద్దుటూరు అబ్జర్వర్ సుబ్రహ్మణ్యం నాయుడు, పరశురాం నాయుడు. తేజాల ఆనంద్ , పాండురాజు, వెంకటేశ్వర్లు నాయుడు, కళాధర్, పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జగన్మోహన్ రాజు

వరల్డ్ బుక్ ఆఫ్ గిన్నిస్ రికార్డ్స్‌లో

చోటు సాధించిన అన్నమయ్య జిల్లా

సీఎం నుంచి సర్టిఫికెట్ అందుకున్న కలెక్టర్, ఎస్పీ

రాజంపేట జూన్23 ప్రభాతవార్త

అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో చోటు సాధించారు. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, లండన్ వారు అందించిన సర్టిఫికెట్ను సోమవారం సాయంత్రం రాష్ట్ర రాజధాని అమరావతిలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అందుకున్నారు. యోగాంధ్ర 2025 కార్యక్రమంలో భాగంగా మే 21 నుండి జూన్ 21 వరకు అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా యోగా ఆంధ్ర కార్యక్రమాలు నిర్వహించిన విషయం తెలిసిందే. మే 28న అన్నమయ్య జిల్లాలో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆధ్వర్యంలో ఒక గంటలో ఒక యోగ సెషన్ లో 13,594 మంది హెల్త్ వర్కర్స్ తో యోగా చేయించిన విశేష సందర్భంగా అన్నమయ్య జిల్లా, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో చోటు సాధించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్ ను, జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ను అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాజమండ్రి ఎంపీ దగ్గుపాటి పురందరేశ్వరి పాల్గొన్నారు.



సిఎం నుంచి గిన్నిస్ బుక్ రికార్డ్ సర్టిఫికేట్ అందుకుంటున్న కలెక్టర్, ఎస్పీ

వైభవంగా స్వామివారికి పుష్పయాగం

కనుల పండగగా చక్రస్నానం... విశేష సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు

బద్వేల్ అర్బన్ జూన్ 23 ప్రభాతవార్త :

బద్వేల్ పట్టణంలోని సిద్ధవటం రోడ్డు లో వెలిసిన శ్రీ మహాలక్ష్మీ గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి, అభయ ఆంజనేయస్వామి దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు 6,వ రోజు సోమవారం తెల్లవారుజామునుండి వేదపండికలు ఆలయ పూజారి వీరేశ చార్యులు ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు, ఉదయం స్వామివారికి వివిధ రకాల ప్రత్యేక ద్రవ్యాలతో కనుల పండగగా పంచామృత అభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు, అనంతరం సుదర్శన చక్రస్నానం కార్యక్రమాన్ని విశేషంగా చేపట్టడం జరిగింది, స్వామి వారి చక్రస్నానంలో పట్టణ పరిసర ప్రాంత ప్రజలందరూ పాల్గొని స్వామివారి చక్రస్నాన్ని తిలకించారు, అనంతరం పూర్ణాహుతి, ధ్వజా అవరోహణ తోపాటు పలు రకాల విశేష పూజలను ఘనంగా నిర్వహించడం జరిగింది. రాత్రి స్వామివారికి వివిధ రకాల ప్రత్యేక పుష్పాలతో వైభవంగా పుష్పయాగం కార్యక్రమాన్ని కమనీయంగా నిర్వహించడం జరిగింది. స్వామివారి పుష్పయాగంలో పలువురు మహిళలు పలు రకాల పుష్పాలతో ఆలయ ప్రదక్షిణాలు చేసి పుష్పాలను స్వామివారికి సమర్పించడం జరిగింది, స్వామి వారి బ్రహ్మోత్సవాలలో పాల్గొన్న పలువురు భక్తులకు ఆలయ నిర్వహకులు వల్లంకొండు వెంకటరమణ, సెక్రటరీ గొడిసిపాటి అంకయ్య, తాతనబోయిన వెంకటసుబ్బయ్య, మేనేజర్ మాదాపూర్ వెంకటరమణ, గంగిరెడ్డి, సిద్దయ్య, పెంచల్ రెడ్డి, బండారు సురేష్ బాబు దాస సతీష్, పెంచలయ్య మహేంద్ర, వెంకట అనిత్, కాపాడు పలువురి కమిటీ సభ్యులు ప్రత్యేక తీర్థప్రసాదాలను అందజేయడం జరిగింది అనంతరం వారం రోజులు పాటు బ్రహ్మోత్సవాలు నరసింహ కుమార్, వీరేశచార్యులు, వెంకటేశ్వర్లు, అంజన్ దత్త, విష్ణు నరసింహ, హనుమంతచార్యులు, దినేష్ చార్యులు, స్వామివారి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించి వారిని ఆలయ ప్రాంగణంలో పలువురు కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించి వారికి ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో వల్లంకొండు ధనలక్ష్మి, రుక్మిణి, ముచ్చర్ల సుజాత, ప్రవీణ్, పత్తి హేమలత, తులసి దేవి, సుమలత, మెంటా సౌజన్య లక్ష్మి, వసంత, మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ పబ్బతి చంద్రశేఖర్, వరలక్ష్మి, హెడ్ కానిస్టేబుల్ వెంకటసుబ్బయ్య, మాజీ ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు చింతకుంట ధనలక్ష్మి, మెంటా వెంకట నాగేశ్వరరావు, లక్ష్మీనారాయణమ్మ, కనుమరుల పూటీ మస్తాన్ రాజా, శివ సాయి ఈవెంట్స్ సాయి, పత్తి హరీష్, తోపాటు పలువురు భక్తులు పాల్గొన్నారు

ట్రాన్స్ఫార్మర్ల దొంగల ముఠా గుట్టురట్టు

రూ. 11 లక్షలకు పైగా విలువైన రాగి తీగలు స్వాధీనం

మదనపల్లిక్రైమ్, జూన్ 23 ప్రభాత వార్త.

ట్రాన్స్ఫార్మర్ల దొంగను అదుపులోకి తీసుకున్నట్లు మదనపల్లి డి.ఎస్.పి మహేంద్ర తెలిపారు. వారి వద్ద నుంచి రు. 11.5 లక్షల విలువచేసే 626 కిలోల కాపర్ కోటింగ్ కలిగిన వైండింగ్ వైరును స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సత్యసాయి జిల్లా ఓబుల దేవుని చెరువు మండలం బురుజు పల్లికి చెందిన గంగిరెడ్డి కుమారుడు కోటిరెడ్డి రామకృష్ణారెడ్డి (48), అదే మండలం పగడాల వారి పల్లి చెందిన వెంకటేష్ లు దొంగతనాలకు పాల్పడేవారు. వీరిద్దరూ కలిసి 40 ట్రాన్స్ఫార్లను తొలగించి అందులో ఉన్న 626 కిలోల కాపర్ కోటింగ్ వైన్డింగ్ వైర్లు చోరీ చేయడం జరిగిందన్నారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో, బి. కొత్తకోట మండలం బీరంగి గ్రామం, కంబళ్ళపల్లి వద్ద బీ కొత్తకోట సిఐ జీవన్ గంగానాథ్ బాబు ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, ఈ సమయంలో ఒక వ్యక్తి ప్లాస్టిక్ సంచితో పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న సీసీఎస్ ఇన్స్పక్టర్ ఎం. చంద్రశేఖర్లు అతన్ని అదుపులోకి తీసుకుని విచారించగా కె. రామకృష్ణారెడ్డిగా తెలిసింది. రామకృష్ణారెడ్డి, వెంకటేష్ తో కలిసి ట్రాన్స్ఫార్మర్ల చోరీ చేసినట్లు అంగీకరించాడు. వీరిద్దరూ కలిసి బి. కొత్తకోట మండలం 14 చోట్ల, మదనపల్లి మండలంలో 1 చోట, పీటీఎం మండలం 1 చోట, ములకలచెరువు మండలం 7 చోట్ల, గాలివీడు మండలం 1 చోట, కురబలకోట మండలం 1 చోట, సత్య సాయి జిల్లా తలపల మండలం 3 చోట్ల, తనకల్లు మండలం 1 చోట, గాలివీడు మండలం 2 చోట్ల, పుల్లంపేట మండలం 7 చోట్ల, నందలూరు మండలం 1 చోట, పీలేరు మండలం 2 చోట్ల, నల్లచెరువు 1 చోట, గాండ్ల వెంకట మండలం 2 చోట్ల మొత్తంగా 40 ట్రాన్స్ ఫార్మర్లను పగులగొట్టి అందులోని రాగి తీగను దొంగిలించినట్లు అంగీకరించాడు. దొంగిలించిన వైరును బి కొత్తకోట మండలం బీరంగి గ్రామం రంగసముద్రం ఏరు వద్ద గల చెట్ల పొదలలో దాచిపెట్టినట్లు కూడా తెలిపాడు. దీంతో ఆ వైర్ ను స్వాధీనం చేసుకొని రామకృష్ణారెడ్డిని అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. మరో నిధులు వెంకటేష్ పరార్ లో ఉన్నట్లు డిఎస్పి తెలిపారు. ట్రాన్స్ఫార్మర్ల నుండి దొంగిలించబడిన సుమారు 626 కేజీల కాపర్ కోటింగ్ కలిగిన వైస్టింగ్ వైరును విలువ రూ. 11,42,600 లుగా ఉంటుందన్నారు. నిందితున్ని పట్టుకోవడం లో ప్రతిభ కనబరిచిన సిఐలు జీవన్ గంగనాడ్ బాబు, చంద్రశేఖర్, హెడ్ కానిస్టేబుల్స్ పి. నరసింహులు, శంకర; కానిస్టేబుల్స్ రాఘవ రెడ్డి, శివ, శంకర, దొరబాబు, చలపతి, హెచ్జి సుబ్బయ్య లను డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

బాలసాదన్ హాస్టల్ విజిట్

కడప జూన్ 23 ప్రభాత వార్త.

ప్రభుత్వ బాలుర వసతి గృహము ప్రభుత్వ పరిశీలన గృహము, అక్కయ్యపల్లిలో గల ప్రాంతీయ బాలసాదన్ హాస్టల్ విజిట్ మరియు న్యాయవిజ్ఞాన సదస్సు గౌరవ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ , అమరావతి వారి ఆదేశానుసారంగా గౌరవ చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప డాక్టర్ సి.యామిని వారి సూచనల మేరకు ఎస్.బాబా ఫక్రుద్దీన్, సెక్రటరీకం సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప వారు కడప నగరంలో ఉన్న ప్రభుత్వ బాలుర వసతి గృహమును, ప్రభుత్వ పరిశీలన గృహమును మరియు అక్కయ్యపల్లి లో గల ప్రాంతీయ బాలసాదన్ హాస్టల్ ను విజిట్ చేసి న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగినది. పరిసరాలను, జీవన పరిస్థితులు, భద్రత మరియు భద్రత ఆరోగ్యం మరియు పరిశుభ్రత ఆహారం మరియు మౌలిక సదుపాయాలను పరిశీలించారు. విద్య విలువైనది క్రమశిక్షణతో అభ్యసించాలి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి, వేసవిలో పిల్లల విద్యా ఆరోగ్య విషయాల పట్ల తగు జాగ్రత్తలు వహించాలని అధికారులను ఆదేశించారు, పిల్లలకు అందుతున్న భోజన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారి బాలల సంరక్షణ కొరకు స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం 2024 వివరించారు, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100, చైల్డ్ లైన్ హెల్ప్ లైన్ నెంబర్ 1098, దివ్యాంగజన్ హెల్ప్ లైన్ నెంబర్ 14456, ఉచిత న్యాయ సహాయము, మొదలు అంశాలపై అవగాహన కలిగించారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, కడప వారి దృష్టికి తీసుకొని రావచ్చును అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర వసతి గృహము, ప్రభుత్వ పరిశీలన గృహము సూపర్ ఇండెంట్ మరియు ప్రాంతీయ బాలసాదన్ మేనేజర్, వైద్యాధికారిణి, ఉపాధ్యాయులు మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

వాహనాలపై ప్రెస్,

పోలీస్‌స్టిక్కర్‌లపై స్పెషల్ డ్రైవ్

సంబంధంలేని వారు స్టిక్కర్లు వినియోగిస్తే చర్యలు

అనధికారికంగా సైరన్లు వినియోగించే వారిపై చట్టప్రకారం చర్యలు

జిల్లా ఎస్.పి ఇ.జి అశోక్ కుమార్ హెచ్చరిక

కడప జూన్ 23 ప్రభాత వార్త.

జిల్లాలో కొందరు జర్నలిస్టులు, పోలీసులు కాకున్నా తమ వాహనాలపై ప్రెస్, పోలీస్ అని స్టిక్కర్లు అతికించుకుని తిరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్.పి ఇ.జి అశోక్ కుమార్ హెచ్చరించారు. ఈ మేరకు జిల్లా ఎస్.పి పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రెస్, పోలీస్ విధులతో సంబంధం లేనివారు వాహనాలపై స్టిక్కర్లను అతికించుకోవడం చట్ట వ్యతిరేకమని ఎస్.పి తెలిపారు. సంబంధిత గుర్తింపు కార్డులు లేకుండా తిరిగే వారి వాహనాలను స్పెషల్ డ్రైవ్ చేపట్టి తనిఖీ చేయడం జరుగుతుందని ఎస్.పి తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించే వారి వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందన్నారు. అలాగే, కొందరు అనధికారికంగా వాహనాలకు సైరన్లు బిగించి ధ్వని కాలుష్యానికి, తోటి వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తున్నట్లు తెలిసిందని, అలాంటి వాహనాలను తనిఖీలలో గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

వాల్మీకిపురంకు బస్సు నడపాలని విన్నపం

నిమ్మనపల్లె, జూన్ 23 ప్రభాతవార్త :

అన్నమయ్యజిల్లా మండల కేంద్రమైన నిమ్మనపల్లె నుంచి వాల్మీకిపురంకు ఆర్టీసి బస్సులు నడపాలని సోమవారం రాష్ట్ర రవాణాశాఖామంత్రికి నిమ్మనపల్లె నుంచి ఓ వినతిపత్రం పంపారు. చాలా రోజులుగా నిమ్మనపల్లె నుంచి వాల్మీకిపురంకు ఆర్టీసి బస్సు నడవక పోవడంతో ప్రయాణీకులతో పాటు విద్యార్థిని, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జిల్లా కేంద్రమైన రాయచోటీకి వెళ్ళాలన్నా పుణ్య క్షేత్రమైన తిరుమలకు వెళ్ళాలన్నా వాల్మీకిపురం మీదుగా వెళ్ళాల్సి ఉందని ఆ వినతిపత్రంలో కోరారు. వందమంది సంతకాలతో ప్రజాప్రతినిధులు, నాయకులు వినతిపత్రం సోమవారం పంపారు.

భరతమాత ముద్దుబిడ్డ ముఖర్జి

కురబలకోట, జూన్ 23 ప్రభాతవార్త :

భరతమాత ముద్దుబిడ్డ జనసంగ్ వ్యవస్థాపకులు శ్రీశ్యామ్‌ప్రసాద్ ముఖర్జి అని పలువురు బిజెపి నాయకులు అన్నారు. సోమవారం అంగళ్ళు గ్రామంలో ఆయన వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు తిరుమల పాలదైరీ కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ అఖండ భారతావనికోసం ప్రాణాలు అర్పించిన మహనీయుడు ముఖర్జి అని కొనియాడారు. ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆటోరాజా, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ కమిటి అధ్యక్షులు వెంకటరమణారెడ్డి

కురబలకోట, జూన్ 23 ప్రభాతవార్త :

కురబలకోట మండలం మట్లివారిపల్లె టిడిపి నూతన గ్రామ కమిటీ సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఆ పార్టీ మండల అబ్జర్వర్ ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కమిటీని ఎన్నుకోవడం జరిగింది. గ్రామంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా ఈ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారని ఆబ్జర్వర్ ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. గ్రామ కమిటీ అధ్యక్షునిగా వెంకటరమణారెడ్డి, ఉపాధ్యక్షునిగా సురేంద్రరెడ్డి, కార్యదర్శులుగా వేమనారాయణ, నిరంజన్‌రెడ్డి, భాస్కర్‌లను ఎన్నుకొన్నారు. ఈ కార్యక్రమంలో తంబళ్ళపల్లె నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షులు శ్రీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

సిపిఐ 10వ మండల మహాసభ ర్యాలీ

సిపిఐ అరుణ పతాకాన్ని ఎగురవేస్తున్న నాయకులు

పోరుమామిళ్ల రూరల్, జూన్ 23 ప్రభాతవార్త:

నిరంతరం ప్రజా సమస్యలేయంగా ఉద్యమమే ఊపిరిగా సిపిఐ 10 వ మండల మహాసభలో పాలక ప్రభుత్వాలపై సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర మండిపడ్డారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు పోరుమామిళ్ల పట్టణంలోని స్థానిక పంచాయతీ కార్యాలయం నుండి ర్యాలీ ప్రారంభించి అనంతరం సిపిఐ అరుణ పతాకాన్ని ఎగరవేసి మండల సమావేశం ప్రారంభిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్, సిపిఐ ఏరియా సహాయ కార్యదర్శి పిడుగు మస్తాన్, కార్యవర్గ సభ్యులు, పివి రమణ, కోడూరు కేశవ,బాలు, పివి రమణ, సఫా, పేరయ్య, చెన్నయ్య, ఫిరోజ్, నాగరాజ్, ప్రసాద్, సునీల్,నాగేశం, ఇమ్మానియేల్, అధిక సంఖ్యలో మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

యువత పోరుకు విజయవంతం

నిరసన చేస్తున్న వైసీపీ నాయకులు

పోరుమామిళ్ల రూరల్, జూన్ 23 ప్రభాతవార్త:

కడప లో ఏర్పాటు చేసిన యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ వైఎస్ఆర్సిపి నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు. మాజీ ముఖ్యమంత్రి, మన నాయకుడు వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, విద్యార్థులకు మద్దతుగా కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు మేనిపెస్టోలో చెప్పిన విధంగా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్, వసతి దీవెన, విద్యా దీవెన కింద ఇవ్వాల్సిన బకాయిలు, మెడికల్ కాలేజ్ లు ప్రైవేటీకరణ పై, నిరుద్యోగ యువతకు రూ. 3,000 భృతి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, వారి విశ్వాసాన్ని పటాపంచలు చేయడాన్ని నిరసిస్తూ ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఓసూరి సునీల్‌కు నివాళు

పోరుమామిళ్ల రూరల్, జూన్ 23 ప్రభాతవార్త:

కలసపాడు మండలం సింగరాయపల్లె గ్రామానికి చెందిన మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ ఓసూరి సునీల్ గుండెపోటుతో ఆదివారం మృతి చెందడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న బద్వేల్ నియోజకవర్గ వైయస్సార్ సిపి అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథ రెడ్డి స్వర్గస్తులైన ఓసూరి సునీల్ మృతదేహాన్ని సందర్శించి, పూలమాలవేసి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వీరి దహన సంస్కరాల నిమిత్తం తగిన ఆర్థిక సహాయంను అందజేశారు . ఈ కార్యక్రమంలో కలసపాడు మండల వైయస్సార్ సి పి ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఓసూరి సునీల్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న నల్లేరు విశ్వనాథ రెడ్డి

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

మదనపల్లిక్రైమ్, జూన్ 23 ప్రభాత వార్త.

మదనపల్లెలో ఓ చైన్ స్నాచర్ పట్టపగలే మహిళ మెడలో బంగారు గొలుసును చోరీ చేసి పరారయ్యాడు. ఈ సంఘటన సోమవారం మదనపల్లె పట్టణంలో జరిగింది. ఈ మేరకు బాధితురాలు ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని సొసైటీ కాలనీలో నివాసముంటున్న లేట్ నరసింహారెడ్డి భార్య సత్యారెడ్డి(65) స్థానిక బిటీ కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందారు. సోమవారం మధ్యాహ్నం పట్టణంలోకి వెళ్లేందుకు స్థానిక రామాలయం వద్దకు వచ్చి ఆటో కోసం వేచి ఉండగా, ద్విచక్రవాహనంలో అటుగా వచ్చిన గుర్తు తెలియని దుండగుడు ఆమె మెడలో ఉన్న 32 గ్రాముల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు. దీంతో బాధితురాలు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

మదనపల్లెక్రైం, జూన్ 23 ప్రభాతవార్త :

నిందితుడి అరెస్ట్ చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

నాటుసారా తయారి చేసి విక్రయిస్తున్న వ్యక్తిని, సారా తయారికి నల్లబెల్లం సరఫరా చేసిన వ్యాపారిని అరెస్ట్ చేసినట్లు మదనపల్లె ఎక్సైజ్ సిఐ భీమలింగ తెలిపారు. సిఐ కథనం మేరకు వివరాలిలా వున్నాయి. నిమ్మనపల్లె మండలం గార్లబురుజుకు చెందిన వెంకటరమణ (71) గ్రామసమీపంలో నాటుసారా తయారుచేసి విక్రయిస్తున్నట్లు సమచారం రావటంతో సిఐ అధ్వర్యంలో దాడులు చేశారు. ఈ దాడుల్లో 10లీటర్ల సారాను స్వాధీనం చేసుకోవటంతో పాటు, 300లీటర్ల ఊటను ధ్వంసం చేశారు. అతన్ని అదుపులోకి తీసుకుని విచారణ చేయగా, బెల్లం తయారికి మదనపల్లెకు చెందిన వ్యాపారీ మహేష్ సరఫరా చేసినట్లు తెలియటంతో అతన్ని కూడా అరెస్ట్ చేసినట్లు సిఐ తెలిపారు. వారిద్దరిని రిమాండ్‌కు తరలించారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

వేంపల్లె: జూన్ 23 (ప్రభాత వార్త):

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారినైన ఉపేక్షించేది లేదని వేంపల్లి సీఐ నరసింహులు పేర్కొన్నారు. మట్కా, జూదం, నాటుసారా తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అందిన సమాచారం మేరకు నాగూరు గ్రామంలో మట్కా ఆడుతున్న 5 మంది ని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి , 8000 రూపాయలు నగదు, మట్కా స్లిప్పులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని ఈ సందర్భంగా సీఐ నరసింహులు, ఎస్ఐ రంగారావులు సూచించారు.

గొప్ప దేశభక్తుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ

వేంపల్లె: జూన్ 23 (ప్రభాత వార్త):

జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా సోమవారం వేంపల్లిలో బీజేపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం భాజపా జిల్లా ప్రధానకార్యదర్శి గాలి హరి ప్రసాద్ మాట్లాడుతూ నెహ్రూ ప్రధాన మంత్రిగా ఉన్న సమయంలో భారత దేశం నుండి కాశ్మీర్ ను విడదీస్తూ తెచ్చిన ఆర్టికల్ 370 ని రద్దు చేయాలని కోరుతూ పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్న శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ తన పదవికి రాజీనామా చేసి ఒకే దేశంలో రెండు జాతీయ జెండాలు, రెండు రాజ్యాంగాలు, ఇద్దరు ప్రధానులు (ఏక్ దేశ్ మే దో నిషాన్,దో విధన్, దో ప్రధాన్ నహీ చలేంగే) అంటూ నినదించిన వ్యక్తి శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అని అన్నారు. అఖండ భారతదేశం కోసం బలిదానం అయిన వ్యక్తి ముఖర్జీ అని తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షురాలు పి సుస్మా మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ అధికారంలోనికి వచ్చిన తరువాత ముఖర్జీ గారి కలలను నిజం చేస్తూ నరేంద్రమోడీ సాహసోపేతమైన నిర్ణయం తీసుకుని ఆర్టికల్ 370 ని రద్దు చేసి కాశ్మీర్ ను భారత భూభాగంలొ కలపడం జరిగిందని అన్నారు. సమైక్య భారతం కోసం తన ప్రాణాలను తృజించిన శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ గారి వర్ధంతి ని బలిదివాన్ దివస్ గా నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నేషనల్ కౌన్సిల్ మాజీ సభ్యులు బొమ్మిరెడ్డి లక్ష్మిరెడ్డి, మండలశాఖ అధ్యక్షులు ఈశ్వరరెడ్డి, మల్లికార్జునరెడ్డి, చరణ్, ప్రసాద్, దొంతు సంతోష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆవిర్భావ దినోత్సవంను ఘనంగా నిర్వహించండి

రామసముద్రం జూన్ 23 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని టిటిడి కల్యాణ మండపం నందు సోమవారం జులై 7వ తేదీన ఎంఆర్పియస్ 31వ ఆవిర్భావ దినోత్సవంను విజయవంతం చేయుటకు,పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ జన్మదినాన్ని పురస్కరించుకొని ఎంఆర్పియస్, ఎంయస్పి, విహెచ్పియస్, ఇతర అనుబంధ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అన్నమయ్య జిల్లా ఇంచార్జ్ కోటా దానియల్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఆర్పియస్ అధినేత పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఎస్సీ వర్గీకరణ ఉద్యమం కోసం 30సంవత్సరాల పోరాటాలను, ఫలితాలను తెలియజేస్తూ జులై 7వ తేదీన ఎంఆర్పియస్ 31వ ఆవిర్భావ దినోత్సవంను మండలంలోని అన్నీ మాదిగ గ్రామాలలో నూతన కమిటీలను నిర్మాణం చేసి, అంగరంగ వైభవంగా జరపాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా ఇంచార్జ్ కోటా దానియల్, జిల్లా అధ్యక్షులు రవీంద్రబాబు, జిల్లా ఉపాధ్యక్షులు రాజేష్, ఎంయస్పి నాయకులు కొండప్ప,ఎంఆర్పియస్ మండల అధ్యక్షులు గంగాధర్,ఎంయస్పి మండల అధ్యక్షులు సుధాకర్,విహెచ్పియస్ మండల అధ్యక్షులు విశ్వనాథ్, ఎంయస్ యఫ్ నాయకులు సుబ్బు, భాస్కర్,అశోక్,ఎంయస్పి నాయకులు గుండ్లపల్లి శ్రీనివాసులు, రవి,ఎలకపల్లి వెంకటరమణ, రమేష్, ప్రశాంత్, కిట్టా, శీనా తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎంపీడీవోగా శ్రీనివాసులు

చిట్వేలి, జూన్ 23,ప్రభాతవార్త:

చిట్వేలి నూతన ఎంపీడీవో గా శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. తిరుపతి జిల్లా వెంకటగిరి నియోజకవర్గ బాలాయ్య పల్లె మండలం నుంచి చిట్వేలికి బదిలీ అయ్యారు. తాను మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ చేర్చే విధంగా నిష్పక్షపాతంగా పని చేస్తానన్నారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు సేవలు అందించాలన్నారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులకు ఎంపీడీవో శ్రీనివాసులు సూచించారు.

కర్ణాటక పోలీసులకు మదనపల్లె బైకుల దొంగ

మదనపల్లిక్రైమ్, జూన్ 23 ప్రభాత వార్త.

కర్ణాటక హెచ్ ఏఎల్ పోలీసులు సోమవారం కర్ణాటక రాష్ట్రంతో పాటు అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో బైకులను దొంగలించే మదనపల్లెకు చెందిన ఘరాన దొంగ హేమంత్ (24) ను పట్టుకున్నారు. విచారణలో దొంగ నోరు విప్పడంతో మదనపల్లెలో హెచ్ ఏ ఎల్ పోలీసులు తనిఖీలు నిర్వహించి పది బైక్ లను సీజ్ చేశారు. అలాగే చిత్తూరు జిల్లా బోయకొండలో 15 బైక్ లను సీజ్ చేసి లారిలో కర్ణాటకకు తరలించినట్లు హెచ్ఏఎల్ ఎస్ఐ దామప్ప తెలిపారు.

మంగంపేట హైవే వద్ద ప్రయాణం యమ డేంజర్

ఓబులవారిపల్లి జూన్ 23 ప్రభాతవార్త

కడప చెన్నై ప్రధాన రహదారి మంగంపేట హైవే వద్ద ప్రయాణికులు ప్రయాణించాలంటే ప్రాణాలను చేతులు పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ ప్రయాణించాల్సిన పరిస్థితి దాపురించిందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఏడు గంటల దాటితే దుమ్ము ధూళి కాలుష్యంతో ఎదురుగా వచ్చే వాహనాలు కూడా కనిపించకుండా లైటింగ్‌తో దుమ్ము వెదజల్లి తీవ్ర ఇబ్బందులకు ఎదిరి ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కూడా కోల్పోయారని అటు ప్రజలు ఇటు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సేఫ్టీ ప్రకాశం తీసుకుని సాయంకాలం వేళల్లో నీరు చెల్లించి రోడ్డుపై దుమ్ములేకుండా పలు జాగ్రత్తలు తీసుకుని హెచ్చరికలు బోర్డులు ఏర్పాటు చేయాలని గోవిందం పల్లి ప్రజలు వాహనదారులు అధికారులు కోరుతున్నారు.

ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి మృతి

గాలివీడు, జూన్ 23(ప్రభాతవార్త):

గత రెండు రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన గోవిందాచారి మృతిచెందినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఆయన కథనం మేరకు.. కొర్లకుంట పంచాయతీ కుమ్మరపల్లికి చెందిన గోవిందాచారి గత కొన్ని సంవత్సరాల క్రితం గాలివీడు మండలం కేంద్రానికి సమీపంలోని పాపిరెడ్డిగారిపల్లెకు సమీపంలో నివాసం ఉండేవారని ఆయనకు కిడ్నీలకు సంబంధించి వ్యాధి ఉండేదని తెలిపారు. నావల్ల నా కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పాలు కాకూడదని మరియు వ్యాధి వల్ల తీవ్ర నొప్పితో బాధపడుతున్నానని మానసికంగా కృంగిపోయి గత 19వ తేదీ రాత్రి పురుగుల మందు తాగినట్లు అతని భార్య రమణమ్మ తమకు ఫిర్యాదు చేసిందని తెలిపారు. పురుగుల మందు తాగిన వ్యక్తిని రాయచోటి చిత్తూరు వైద్యశాలలకు తీసుకువెళ్లి చికిత్స చేస్తుండేవారని అక్కడ ఆరోగ్యం కుదుట పడకపోవడంతో తిరుపతికి తీసుకెళ్లామని అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు ఆమె తమకు ఫిర్యాదులో పేర్కొందని తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

నేర్చుకుంటేనే గెలవగలం !

తమ కలల్ని నెరవేర్చు కుంటూ కోరుకున్న ఉద్యోగంలో కుదురుకున్నా.. పదోన్నతులు అందు కోవడంలో కొందరు వెనకబడుతుంటారు. ఇలాంటప్పుడు పనితీరుని సమీక్షించుకోవడం చాలా

అవసరం అదెలాగంటే..

లక్ష్యాలకు తగ్గ ప్రణాళిక: ప్రతి ఒక్కరికీ కొన్నిన లక్ష్యాలు ఉండాలన్నది నిజమే అయినా.. వాటిని సాధించడానికి మీ దగ్గర సరైన ప్రణాళిక ఉందో లేదో చూసు కోండి. ఎందు కంటే విజయ తీరాలకు చేరిన వారందరికీ స్పష్టమైన ఆలోచన, ప్లాన్ తప్పనిసరిగా ఉంటాయి మరి. అదీ డాక్యు మెంటేషన్ అయి ఉండాలి. లేదంటే మీ ఆలోచనలన్నీ నీటి మీద రాతలే అవుతాయి. కాలంతో పోటీపడాలి:. ప్రణాళిక వేసుకోగానే విజయం మీ చెంతకి వచ్చేయదు. కాలంపై పట్టు, పనిపై అవగహన కూడా ఉండాలి. ఎంత కష్టమైనా సరే, అనుకున్న గడువు కంటే ముందు చేయగలగాలి. ఇది ఒక్కసారిగా అలవడకపోవచ్చు. కానీ, ప్రయత్నిస్తే సాధ్యమే. ఎందుకంటే ఈ రోజుల్లో ప్రతి ఒక్కరూ కాలం కంటే వేగంగా పరుగెడితేనే గమ్యాన్ని చేరుకునేది.

నేర్చుకోండి: ఉద్యోగంలో చేరాం హమ్మయ్య అనకుని సరిపెట్టేసు కోకండి. ఎప్పటికప్పుడు మార్కెట్ పోకడల్ని తెలుసుకుంటూ నైపుణ్యాలను ఒంట పట్టించుకోవాలి. ప్రముఖ సంస్థలు అప్పుడప్పుడూ శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేస్తుంటాయి. అలాంటి వాటిని వినియోగించుకుని నైపుణ్యాలతో పాటు జీవన

నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి.

విశ్లేషించుకోండి.. చిన్న విజయానికే పొంగిపోవడం, వెనకబడి నప్పుడు కుంగిపోవడం సరికాదు. ఎట్టి పరిస్థితుల్లోనూ మానసిక స్థైర్యాన్ని కోల్పోకూడదు. పొరపాటు జరిగితే కారణాలను నిశితంగా పరిశీలించుకోవాలి. విశ్లేషించుకుని.. మరోసారి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అప్పుడే పనిలో నైపుణ్యం సాధించడంతో పాటు పదోన్నతులూ అందుకోగలుగుతారు.

7మంది పంచాయతీ కార్యదర్శులు చేరిక

దువ్వూరు, జూన్ 23, ప్రభాతవార్త:

ఇటివల రాష్ట్ర ప్రభుత్వం బదిలీలు చేపట్టడంతో మండంలోని సుమారు 7మంది పంచాయతీ కార్యదర్శులు బదిలీ కాగా వారి స్థానాల్లో 7మంది విధుల్లో చేరినట్లు ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. చింతకుంట కార్యదర్శిగా ధనేశ్వర బాబు, కానగూడూరుకు బాలస్వామి, మాసనపల్లెకు భాగ్యలక్ష్మి, కృష్ణంపల్లెకు రమణారెడ్డి, చిన్న సింగనపల్లెకు చంద్రశేఖర్ రెడ్డి, గుడిపాడుకు లక్షుమయ్య, నేలటూరుకు శ్రీనివాసులు బదిలీపై వచ్చారని వారు బాధ్యతలు కూడ చేపట్టినట్లు ఎంపీడీఓ తెలిపారు. ఇంకా దువ్వూరు 1, 2 సచివాలయాలు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు.

ప్రజా సమస్యలను పరష్కరించాలి

దువ్వూరు, జూన్ 23, ప్రభాతవార్త:

మండలంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వస్తున్న సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా క్షేత్రస్థాయి సిబ్బంది పనిచేయాలని తహసీల్దార్ సంజీవరెడ్డి అన్నారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుండి వినతులు స్వీకరించారు. వాటిపై వచ్చిన వినతిపత్రాలను సంబంధిత అధికారులకు పంపారు. నిర్ణీత సమయంలోనే వాటిని పరిష్కారం చూపి అధికారులు నివేదిక అందజేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.

అమ్మయ్యాక అందంగా ..

అమ్మతనం మనలో ఎన్నో మార్పులు తీసుకొస్తుంది. ఈ దశలో అటు శారీరకంగానే కాదు.. ఇటు సౌందర్య పరంగానూ పలు మార్పులు రావడం గమనించచ్చు. ముఖ్యంగా ముఖంపై మొటిమలు- మచ్చలు, చర్మంపై పిగ్మెంటేషన్-స్ట్రెచ్ మార్క్స్, విపరీతంగా జట్టురాలిపోవడం.. ఇలా కొత్తగా తల్లైన వారు అందం పరంగా వివిధ రకాల సమస్యల్ని ఎదుర్కొంటుంటారు. బిడ్డ పుట్టాక తల్లుల శరీరంలో ఈస్ట్రోజెన్, ప్రొజెస్టరాన్. వంటి హార్మోన్ల స్థాయులు ఒక్కసారిగా పడిపోవడమే ఇందుకు కారణమంటున్నారు నిపుణులు. అలాగని ఈ సమస్యల్ని పరిష్కరించుకోలేమా అంటే.. అందుకు చిన్న చిన్న చిట్కాలను పాటించాలని సూచిస్తున్నారు. మరి, అవేంటో తెలుసుకుందాం..

ఎలాంటి సమస్యలొస్తాయంటే..

◆ గర్భిణిగా ఉన్న సమయంలో హార్మోన్ల స్థాయుల్లో పెరుగుదల కారణంగా జుట్టు రాలడం తగ్గిపోతుంది. అదే డెలివరీ తర్వాత హార్మోన్ల స్థాయులు తిరిగి సాధారణ స్థితికి చేరుకోవడం/ తగ్గుదాల వల్ల జుట్టు రాలడం అధికమవుతుంది. అయితే ఇది తాత్కాలికమే అని మహా అయితే 6-12 నెలల పాటు ఈ సమస్య ఎక్కువగా ఉండచ్చంటున్నారు.



◆ ప్రసమం తర్వాత హార్మోన్లలో మార్పులు, ఒత్తిడి, అలసట.. వంటివన్నీ ముఖంపై మొటిమలు రావడానికి కారణమవుతాయి. ముఖ్యంగా ఈ దశలో ప్రొజెస్టరాన్ హార్మోన్ స్థాయుల్లో వచ్చే మార్పుల వల్ల సెబేషియస్ గ్రంథులు ఎక్కువ నూనెల్ని విడుదల చేస్తాయి. తద్వారా ముఖంపై మొటిమలు, వాటి తాలూకు మచ్చలు ఏర్పడుతుంటాయి.

◆. ప్రసవం తర్వాత సౌందర్యపరంగా వచ్చే మరో సమస్య పిగ్మెంటేషన్/మెలస్మా.
ఈ క్రమంలో చర్మంపై నల్లటి ప్యాచుల్లాంటి మచ్చలు ఏర్పడడం గమనించచ్చు.

◆ ఇక బిడ్డ పుట్టాక నిద్రలేమి, హార్మోన్ల స్థాయుల్లో మార్పులు, విపరీతమైన అలసట.. వంటివన్నీ కళ్లు ఉబ్బడం, కళ్లకింది నల్లటి వలయాలు ఏర్పడడం..
వంటి సమస్యలకు దారితీస్తాయి.

.. ఈ చిట్కాలతో తిరిగి అందంగా... ప్రసవానంతరం ఎదురయ్యే మొటిమల సమస్యను దూరం చేసుకోవలంటే రోజుకు రెడుసార్లు గాఢత తక్కువగా ఉండే క్లెన్సర్‌తో ముఖాన్ని శుభ్రం చేసు కోమంటున్నారు నిపుణులు. ఇక ఇలాంటి వారు ఉపయోగించే ఫేస్‌ప్యాక్స్‌లో కలబంద, యూకలిప్టస్ ఆయిల్. వంటి పదార్థాలను చేర్చుకుంటే ఫలితం ఉంటుంది. అంతేకాదు.. బయటికి వెళ్లేటప్పుడు మాయిశ్చరైజర్ రాసుకోవడం తప్పనిసరి. అది కూడా ఆయిల్ రహితమైనదై ఉండాలన్న విషయం గుర్తుపెట్టుకోండి.

◆ పిగెమంటేషన్ సమస్యను తొలగించుకోవడానికి ప్రస్తుతం మార్కెట్లో ప్రత్యేకమైన మాయిశ్చరైజర్స్ అందుబాటులో ఉన్నాయి. వాటిని నిపుణుల సలహా మేరకు వాడితే సరి. అలాగే పసుపు నిమ్మరసం, కలబంద గుజ్జు, బంగాళాదుపం, కమలాఫలం తొక్కలపొడి.. వంటివి మీరువాడే ఫేస్‌ప్యాక్స్‌లో చేర్చుకున్నా చక్కటి ఫలితం ఉంటుంది.

◆ ఇక కంటి అలసటను, కళ్ల కింద నల్లటి వలయాలను దూరం చేసుకోవడానికి సమయం దొరికినప్పుడల్లా విశ్రాంతి తీసుకోవడం ఒక్కటే మార్గం. ఈ క్రమంలో పాపాయి పడుకున్నప్పుడే మీరూ నిద్రకు ఉపక్రమించేలా చూసుకోండి. అలాగే నిపుణుల సలహా మేరకు ఐ క్రీమ్‌ని కూడా వాడచ్చు. ◆ క్రీమ్స్/ ఆయిల్స్‌తో పాటు చక్కటి పోషకాహారం, బ్రిస్క్, వాక్-యోగా వంటి తేలికపాటి వ్యాయామాలు. ఈ మార్ప్‌ని తొలగించడంలో కొంతవరకు సహాయపడచ్చని చెబుతున్నారు. ◆ ఇక ఇంట్లో తయారుచేసుకున్న స్క్రబ్‌తో వారానికోసారి చర్మాన్ని మృదువుగా మర్దన చేసుకోవడం వల్ల కూడా ప్రసవానంతర సౌందర్యాన్ని తిరిగి పొందచ్చు. ఇలా చేయడం వల్ల పొలుసులుగా మారిన చర్మం మృదుత్వాన్ని సంతరించు కుంటుంది. మొటిమలు-మచ్చలు.. వంటి సమస్యలు కూడా తగ్గుముఖం పడతాయి.

ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది

ఇర్నగ రెడ్డి నాగేశ్వర్ రెడ్డి తండ్రి నాగిరెడ్డి అడ్రస్ కోటం గురువాయ పల్లె గ్రామం, ఖాజీపేట (మం) కడప (జిల్లా)ఏపీ., మా ఇంటి నుండి జిరాక్స్ కొరకు బైకుపై ఖాజీపేట మండల కేంద్రముకు వెళుతుండగా మా ఇంటి ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది నెం: 823/1939 దొరికిన వారు పై అడ్రస్‌కు తెలియజేయగలరు తగిన పారితోషికం ఇవ్వబడును సెల్ no: 6302723525

కూటమి ప్రభుత్వంపై దండయాత్ర.

ఉద్యోగం లేదు..భృతి లేదు.. భవిష్యత్తే లేదా?

రాయచోటి జూన్ 23 ప్రభాతవార్త

అన్నమయ్య జిల్లాలోని యువత, విద్యార్థులు కడలి తరంగమై కదలి వచ్చారు. హామీలిచ్చి మోసం చేసిన కూటమి సర్కారుపై ధ్వజమెత్తారు. ఉద్యోగాల కల్పన, నెలకు నిరుద్యోగ భృతి రూ 3 వేలు, ఫీజు రీఎంబర్స్మెంట్ బకాయిల నిధులు విడుదల చేయనందుకు నిరసనగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ ఇచ్చిన పిలుపు మేరకు జిల్లా కేంద్రమైన రాయచోటిలో వైఎస్ఆర్ సిపి యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో చేపట్టిన యువత పోరు విజయవంతం అయింది. జిల్లా కలెక్టరేట్ ప్రధాన ద్వారం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు యువతకి గర్జన చేసింది. జిల్లా నలుమూలల నుంచి యువత, విద్యార్థులు వేలాదిగా తరలివచ్చి గర్జించారు. ప్రజలను, యువతను, విద్యార్థులను మోసం చేయడంలో బాబు ట్రేడ్ మార్క్ అన్నారు. యువతకు, విద్యార్థులకు ఇచ్చిన హామీలను నెరవేర్చేవరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. ఇచ్చిన హామీలపై పోరాడి చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేసేలా తీరుతామని నిరుద్యోగ యువత, విద్యార్థులు కూటమి పాలనపై దండెత్తారు. ఎన్నికల హామీలను నెరవేర్చాలని కోరుతూ డిఆర్ఓకు యువత, విద్యార్థి విభాగాల నాయకులు వినతి పత్రం సమర్పించారు.

అన్నమయ్య జిల్లా డిఎమ్‌హెచ్‌ఓగా లక్ష్మీనరసయ్య

రాయచోటి జూన్ 23 ప్రభాతవార్త

జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారిగా డాక్టర్ లక్ష్మీ నరసయ్య సోమవారం భాద్యతలు స్వీకరించారు. 2025 సాదారణ బదిలీలలో భాగంగా డాక్టర్ లక్ష్మీనరసయ్య జిల్లా డిఎమ్‌హెచ్‌గా రాయచోటికి బదిలీ అయ్యారు. కర్నూలు ప్రాంతీయ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్‌గా ఉన్న డాక్టర్ లక్ష్మీనరసయ్య బదిలీపై వచ్చారు. గతంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మహల్, ఎర్రకోటపల్లి, పిహెచ్‌సిలలో వైద్యాధికారిగా మరియు మదనపల్లి, తంబళ్లపల్లి క్లస్టర్ డిప్యూటీ డిఎమ్‌హెచ్‌ఓగా మదనపల్లి జిల్లా ఆస్పత్రి ఆర్ఎమ్‌ఓగా విధులు నిర్వహిస్తు పదోన్నతి పై కర్నూల్ ఆర్‌టిసి ప్రిన్సిపాల్‌గా వెళ్లారు. ఈ సందర్భంగా డిఎమ్‌హెచ్‌ఓను కార్యాలయంలో ప్రోగ్రామ్ అధికారులు, కార్యాలయ సిబ్బంది, యూనియన్ ప్రతినిధులు, ఆరోగ్య సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

మినిస్టర్ సవితమ్మను కలిసిన దివిటి పద్మా

రాయచోటి జూన్ 23 ప్రభాతవార్త

జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షురాలు దివిటీ పద్మ యాదవ్ సోమవారం రాష్ట్ర బీసీ వెల్ఫేర్ మినిస్టర్ సరితమ్మను కలిశారు. ఈ సందర్భంగా ఆమె అన్నమయ్య జిల్లాలోని బీసీల సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా బీసీల అభ్యున్నతికి వారి జీవనోపాధి కొరకు ఉపాధిని కల్పించాలని ఆమెను కోరారు. అంతేకాకుండా అన్నమయ్య జిల్లాలోని రాయచోటిలో బీసీ జిల్లా భవనం కట్టడానికి భూమిని చూపించాలని సంబంధిత రెవెన్యూ అధికారులు తెలిపి సహకరించాలని ఆమె వారికి సూచించినట్టు తెలిపారు. దీనికి ఆమె స్పందిస్తూ రెవెన్యూ అధికారులకు తెలిపి అన్నమయ్య జిల్లాలో బీసీ భవనం నిర్మించుటకు కావలసిన స్థల సేకరణగురించి వారికి తెలియజేస్తానని హామీ ఇచ్చినట్లు ఆమె తెలిపారు. ఆమెతోపాటు పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.

యువత పోరుకు వైసిపి యువజన సైన్యం

ప్రొద్దుటూరు జూన్ 23 ప్రభాతవార్త

నిరుద్యోగ భృతి యువత సమస్యలపై వైసీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో కడప కలెక్టరేట్ ఎదురుగా పోరుబాట పట్టేందుకు ప్రొద్దుటూరు వైసిపి యువజన సైన్యం సోమవారం తరలి వెళ్లారు. వైసిపి రాష్ట్ర యువజన విభాగం ఆదేశాల మేరకు స్థానిక మాజీ ఎమ్మెల్యే వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి నేతృత్వంలో ప్రొద్దుటూరు నియోజకవర్గం వైసీపీ యువజన విభాగం అధ్యక్షులు ద్వార్శల గురునాథరెడ్డి ఆధ్వర్యంలో తరలి వెళుతున్న యువతకు మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షులు మోడెం సందీప్ కార్యదర్శి పేరం సుమన్ రెడ్డి ఎగ్జిక్యూటివ్ నెంబర్ బాలాజీ దివాస్ మండల యువజన విభాగం అధ్యక్షులు రామాంజనేయరెడ్డి రాజుపాలెం మండలం యువజన విభాగం అధ్యక్షులు యోగానంద రెడ్డి అధ్యక్షులు భాష ప్రొద్దుటూరు యువజన విభాగం ఉపాధ్యక్షులు చంటి పొద్దుటూరు నియోజకవర్గ స్టూడెంట్ యూనియన్ వింగ్ అధ్యక్షులు వైసీపీ నాయకులు వెలవలి శేఖర్ రెడ్డి మండల కన్వీనర్ మార్చల ఓబులారెడ్డి బండి సనారెడ్డి మరియు వైసీపీ నాయకులు కార్యకర్తలు సభ్యులు పాల్గొన్నారు.

శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా బలిదాన్ దివాస్

ప్రొద్దుటూరు జూన్ 23 ప్రభాతవార్త

జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా సోమవారం సాయంత్రం ప్రొద్దుటూరు ఒకటవ పట్టణ అధ్యక్షులు వంకదార నరేంద్రరావు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక వైఎమ్ఆర్ కాలనీ లోని బిజెపి కార్యాలయంలో ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి బిజెపి శ్రేణులు ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మహిళా మోర్చా అధ్యక్షురాలు సివి జయలక్ష్మి మాట్లాడుతూ అఖండ భారత దేశం కోసం బలిదానమైన వ్యక్తి ముఖర్జీ అని కొనియాడారు భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖర్జీ కలలను నిజం చేస్తూ ప్రధాని నరేంద్ర మోడీ సాహసోపేతమైన నిర్ణయం తీసుకొని ఆర్టికల్ 370 ని రద్దుచేసి కాశ్మీర్ భారత్ భూభాగంలో కలపడం జరిగిందన్నారు సమైక్య భారత్ కోసం ముఖర్జీ తన ప్రాణాలను త్యజించిన సందర్భంగా ఆయన వర్ధంతిని బలిదాన్ దివాస్ గా నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి చెన్న మోహన్ మహిళా అధ్యక్షురాలు ఎన్ కుమారి కార్యదర్శి హరికృష్ణ మరియు బిజెపి నాయకులు క్రియాశీలక పాల్గొన్నారు.

మిగిలిన సీట్లకు ప్రవేశ పరీక్ష

లక్కిరెడ్డిపల్లి ; జూన్ 23, ప్రభాతవార్త

6 7 8 9 తరగతిలో మిగిలిన సీట్లకు నేడు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు మిగిలిన సీట్లకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు నేడు ఉదయం 9 గంటలకు ఏపీ మోడల్ స్కూల్ నందు హాజరు కావాలన్నారు. మెరిట్ ప్రకారము ఆయా తరగతుల్లో చేర్చుకుంటారన్నారు.

యువత పోరులో పాల్గొన్నా మండల వైసిపి నేతలు

రామసముద్రం జూన్ 23 ప్రభాతవార్త

మండలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీనాయకులు ఆధ్వర్యంలో సోమవారం రాయచోటి పట్టణంలో జరిగిన యువత పోరు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాయచోటి బస్టాండ్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు యువత పోరు నిరసన కార్యక్రమం చేపట్టారు.నిరుద్యోగ భృతి ఎప్పుడు ఇస్తావో చెప్పు ముఖ్య మంత్రి చంద్రబాబు అంటూ నినాదాలు ప్లకార్డు లతో నిరసన ర్యాలీ ప్రదర్శన ఈ నిరసన కార్యక్రమంలో మండలం వైసీపీ యూత్ అధ్యక్షులు బాలాజీ మండల బిసి వైసిపి అధ్యక్షులు రెడ్డివీరే గౌడ్ ఆర్ టి ఐ మండల ప్రెసిడెంట్ కిషోర్ రెడ్డి, గొల్ల పల్లె నాగరాజ, నరసింహులు, రమేష్ పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏడాది పాలనలో రాష్ట్రానికి జరిగింది శూన్యం

ధర్నా చేస్తున్న దృశ్యం

మదనపల్లె, జూన్ 23 ప్రభాతవార్త :

ఏడాది కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రానికి జరిగింది శూన్యమంటూ సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈశ్వరయ్య తెలిపారు. సోమవారం అన్నమయ్య జిల్లా సమగ్రాభివృద్ధికి రూ.10వేల కోట్లు నిధులు కేటాయించాలని, జిల్లాలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సిపిఐ ఆధ్వర్యంలో సబ్‌కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. సిపిఐ, కాంగ్రెస్, బహుజన సేన నాయకులు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ కొత్తగా ఏర్పడ్డ అన్నమయ్య జిల్లా అభివృద్ధిలో ఆమడదూరంలో ఉందన్నారు. నాలుగేళ్ళ క్రితం తెగిపోయిన అన్నమయ్య ప్రాజెక్టు, ఫించా ప్రాజెక్టు మరమ్మత్తులు కూడా చేయలేదని విమర్శించారు. నాలుగు దశాబ్దాలు పూర్తి అవుతున్న హంద్రీ-నీవా కాలువ పూర్తి కాలేదని, మదనపల్లె ప్రజల దాహర్తిని తీర్చడానికి నిర్మించిన చిప్పిలి సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. మదనపల్లె ప్రాంతంలో రైతులు టమోటాపైనే ఆధారపడి జీవిస్తున్నారని ఈ ప్రాంతంలో టమోటా ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. మెడికల్ కళాశాలను పూర్తి చేసి పేదలకు వైద్యసేవలు అందించాలన్నారు. ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.300కోట్లు యోగాపేరుతో దుర్వినియోగం చేసిందన్నారు. కాంగ్రెస్ నాయకులు రెడ్డిసాహెబ్, ఆనంద్, బహుజన నాయకులు చందు మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు క్రిష్ణప్ప, మనోహర్‌రెడ్డి, సాంబశివ, మురళి, కాంగ్రెస్ నాయకులు ఎస్‌కె.బాషా, మహమ్మద్‌షరీఫ్, ఖాదర్‌బాషా, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

20వ రోజు కొనసాగిన కార్మికుల సమ్మె

కార్మికులు నిరసన తెలుపుతున్న దృశ్యం

మదనపల్లె, జూన్ 23 ప్రభాతవార్త :

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు సోమవారం సమ్మెను యదావిధిగా కొనసాగించారు. కార్మికులు అందరూ ప్లాకార్డులు పట్టుకొని మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసనలు వ్యక్తం చేశారు. సమ్మె కార్యక్రమంలో జేఏసి నాయకులు ఎంఎస్.కన్నయ్య మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు పూర్తిస్థాయిలో విధులు బహిష్కరించి సమ్మె చేపట్టడం జరిగిందన్నారు. పట్టణంలో, వీధిలైట్లు, తాగునీటి సరఫరాను బంద్ చేసి సమ్మె చేపట్టడం జరిగిందన్నారు. రాష్ట్రంలో అన్ని మున్సిపాలిటిల్లోనూ 50రోజులుగా శాంతియుత సమ్మె నిరసన చేస్తున్నా ప్రభుత్వం ఏమీ పట్టనట్లు వ్యవహరి స్తోందన్నారు. ప్రభుత్వం ఇంజనీరింగ్ కార్మికులకు అన్యాయం చేస్తున్నదన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా, ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు కూడా రాకుండా అన్యాయం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరుజిల్లా ఇంజనీరింగ్ కార్మికులు జేఏసి అధ్యక్షులు ఎస్‌కె.రెడ్డప్ప, జేఏసి నాయకులు ఎంఎస్ ఎస్.కన్నయ్య, నాగరాజు, గోపాల్‌క్రిష్ణ, సజాద్‌కుమార్, బాలక్రిష్ణ, కుమార్, మహేష్, ఇంజనీరింగ్ కార్మికులు పాల్గొన్నారు.

భర్తకు పెన్షన్ ఇప్పించండి : భార్య వేడుకోలు

మదనపల్లె, జూన్ 23 ప్రభాతవార్త :

పక్షవాతంతో కాళ్ళు చేతులు పడిపోయాయని ప్రభుత్వం స్పందించి నా భర్తకు పెన్షన్ ఇప్పించండి మహాప్రభో అంటూ భార్య సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏఓకు విన్నవించింది. రూరల్ మండలం బసినికొండలో కాపురముంటున్న పక్షవాత రోగి చంద్ర భార్య రేణుక సోమవారం సబ్‌కలెక్టరేట్‌లోని ఏఓ నిర్మలకు పిజిఆర్ఎస్‌లో పెన్షన్ ఇవ్వాలని ఆమె విన్నవించింది. పెన్షన్ కోసం ఏడాదన్నర కాలంగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా స్పందించలేదని ఆమె విన్నవించింది. సదరన్ సర్టిఫికెట్ ఇస్తే తన భర్తకు పెన్షన్ మంజూరు అవుతుందని చెబుతున్నారన్నారు. సదరన్ ఆఫీస్‌కు వెలితే ఇంకా సైట్ ఓపెన్‌కాలేదని వారు చెప్పడం జరిగిందన్నారు. కూలి చేస్తేనే కుటుంబ గడిసే తమకు భర్త అనారోగ్యం కారణం వల్ల ఇద్దరు చిన్నబిడ్డలతోతీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. అధికారులు స్పందించి పెన్షన్ మంజూరు చేయాలని ఆమె విన్నవించింది. ఆమెతో పాటు పలువురు ప్రజాసమస్యల పరిష్కార వేధికలో డివిజన్‌లోని పలువురు పలు సమస్యలపై అర్జీలు ఇవ్వడం జరిగింది.

శివోహం అన్న ప్రసాద సేవ అభినందనీయం

ప్రొద్దుటూరు, జూన్ 23 : ప్రభాతవార్త :

గత మూడున్నర సంవత్సరాలుగా శివోహం అన్నప్రసాద సేవా సంఘం వారు పట్టడన్నం పెట్టి పేదల కడుపు నింపడం అభినందనీయమని ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయ పాలకమండలి సభ్యుడు డాక్టర్ వరుణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో ప్రతి సోమవారం నిర్వహించే అన్నప్రసాద సేవలో భాగంగా శివోహం సేవా సంఘం ఉపాధ్యక్షుడు మురికూటి సూర్యనారాయణ సహకారంతో అన్నప్రసాద సేవ నిర్వహించారు. దాదాపు 800 మంది ఈ కార్యక్రమంలో పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సందర్భంగా ఇటీవల ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాల పాలకమండలి సభ్యుడుగా నియమితులైన డాక్టర్ వరుణ్ కుమార్ రెడ్డిని ఈ సందర్భంగా శివోహం కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో శివోహం కమిటీ అధ్యక్షుడు శెట్టిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మూరుకూటి సూర్యనారాయణ రెడ్డి, సభ్యులు విష్ణు నారాయణ, విజయకుమార్, లింగారెడ్డి, కల్లూరు ప్రభాకర్ రెడ్డి, రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ కాలవ త్రవ్వి వదిలేసారు పూడ్చే దిక్కులేరు..!

పెద్దమండెం జూన్ 23 ప్రభాతవార్త

పెద్దమండెం మండలం పంచాయతీలో డ్రైనేజీ కాలువలు పొంగి పొర్లుతున్న పట్టించుకునే నేవాడు కరువయ్యారు బస్టాండ్ కూడలిలో డ్రైనేజీ కాలువ మరమ్మకు గురైతే త్రవ్వి వదిలేశారు ఇప్పటికి 15 రోజులు అవుతున్న పట్టించుకున్న పాపాన పోలేదు అటు సర్పంచ్ గాని కార్యదర్శి గాని మండల అభివృద్ధి అధికారి గాని ఎవ్వరు స్పందించలేదు ఆదమరిస్తే రాత్రి వేళల్లో అంతే సంగతులు ఇది తెలిసి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం పై గ్రామస్తులు ప్రజలు అధికారులపై విమర్శలకు ఇప్పిస్తున్నారు. దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి పంచాయతీ సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు

తంబళ్లపల్లె టిడిపికి సమర్థవంతమైన నాయకుడు

తంబళ్లపల్లె నియోజకవర్గ పరిశీలకుడు సోమశేఖర్.

తంబళ్లపల్లె జూన్ 23 ప్రభాతవార్త ః

మండల పార్టీ అధ్యక్ష పదవికి సమర్థవంతమైన నాయకుడి ఎంపిక అధిష్టానం చేపడుతుందని తంబళ్లపల్లె నియోజకవర్గ పరిశీలకుడు సోమశేఖర్ తెలిపారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో టిడిపి మండల నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం మొత్తం టిడిపి, కూటమిగాలి వీచినా తంబళ్లపల్లెలో జయ చంద్రారెడ్డి ఓడిపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా తెలుగుదేశం పార్టీ శ్రేణులు గ్రూపు రాజకీయాలు పక్కన పెట్టి పార్టీ అధిష్టానం నిర్ణయాన్ని ఆమోదించాలన్నారు. పదవులు రాలేదని ఎవరు బాధపడరాదని ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందని ప్రతి ఒక్కరూ సమన్వయం పాటించాలని సూచించారు. కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసి, కేసులు ఎదుర్కొన్న వారి కేసులు ఎత్తివేయడానికి కృషి చేస్తామన్నారు. మండల పరిశీలకుడు రెడ్డప్ప మాట్లాడుతూ తంబళ్లపల్లె మండలంలో క్షేత్రస్థాయిలో పార్టీ బలంగా ఉందని అయితే కొంత అసంతృప్తి కారణంగా గత ఎన్నికల్లో ఓడిపోవడం జరిగిందని భవిష్యత్తులో పార్టీ ఆదేశాలకు కట్టుబడి పని చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ సత్తా చాటి తంబళ్లపల్లెను టిడిపి కంచుకోటగా మార్చడానికి సహకరించాలన్నారు. తొలుత నియోజకవర్గ పరిశీలకుడు సోమశేఖర్, మండల పరిశీలకుడు రెడ్డప్పల బృందాన్ని మండల టిడిపి నాయకులు ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని టిడిపి నాయకులు, క్లస్టర్ ఇన్చార్జులు, కె ఎస్ ఎస్ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహనీయుని చిత్రపటానికి పుష్పాంజలి..

సుండుపల్లె, జూన్ 23, ప్రభాతవార్త:

మండల పరిధిలో నాలుగు రోడ్ల కూడలిలో ఖండిత భారతపు అఖండత్వం కోసం బలిదానం చేసిన మొట్టమొదటి దేశభక్తుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ పుణ్యతిథి జూన్ 23 అని ఈ సందర్భంగా నివాళులు అర్పిస్తూ బలిదాన్ దివస్ జాతీయ పార్టీ ఆదేశాల మేరకు ఆయనను స్మరించుకుంటూ మహనీయుని చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన మండల అధ్యక్షుడు రమణగౌడ్. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆ మహనీయుడు దేశం కోసం ఆర్టికల్ 370 తొలగింపు కోసం ప్రాణ త్యాగాన్ని చేశాడని తెలియజేశాడు. స్వతంత్ర భారత రాజకీయాకాశంలో సిద్ధాంత రహిత రాజకీయాలు, స్వార్థ , పదవీ వ్యామోహం కారుమబ్బులు కమ్ముకున్న ఆ తొలిదినాలలో ఒకమెరుపు మెరిసి మాయమైందన్నారు. స్వతంత్ర భారత రాజకీయాలకు ఒక నూతన దిశను, నూతన లక్ష్యాన్ని ప్రసాదించిన ఆ మెరుపే స్వర్గీయ డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీఅన్నారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు రెడ్డి రాజాచారి, కార్యదర్శి వెంకటరమణ, యవ నాయకుడు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నాడు విమర్శలు, నేడు ప్రశంసలు

తంబళ్లపల్లె జూన్ 23 ప్రభాతవార్త ః

తంబళ్లపల్లె మండల తాసిల్దార్ కార్యాలయం ఎదుట కొటాల పంచాయతీకి చెందిన సుధాకర్, రమేష్ ఆధ్వర్యంలో గత నెల రోజులు క్రితం రైతులు తమ పనులు జరగలేదని ఆందోళన చేశారు. అయితే నేడు పరిస్థితి మారింది. నూతన తాసిల్దార్ శ్రీనివాసులు తాసిల్దార్ కార్యాలయాన్ని ప్రక్షాళన చేసి రైతుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా మండల రెవెన్యూ అధికారులు, వీఆర్వోలు, వీఆర్ఏలు పనిచేసేలా చర్యలు చేపట్టారు. రైతుల సమస్యలపై వీఆర్వోలు క్షేత్రస్థాయిలో పర్యటించి అక్కడికక్కడే పరిష్కారానికి కృషి చేయాలని రైతులను కార్యాలయం చుట్టూ తిప్పరాదని ప్రతి అధికారి అంకితభావంతో పనిచేయాలని సూచించడంతో రెవెన్యూ యంత్రాంగం ఆయన ఆదేశాలకు అనుగుణంగా పని చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై సోమవారం కొటాల రైతులు సుధాకర్, రమేష్‌లు తాసిల్దార్‌ను సత్కరించడం హర్షనీయం.

వైసీపీని బలోపేతం చేయాలి

పీలేరు జూన్ 23 ప్రభాతవార్త :

నియోజకవర్గంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు తమ సహకారం కావాలని ఏపీఎండిసి డైరెక్టర్ హరీష్ రెడ్డి మాజీ మంత్రి పుంగనూరు శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కోరారు. సోమవారం మాజీ మంత్రి పెద్దిరెడ్డిని కలిసి నియోజకవర్గంలోని పల్లెల సమస్యలపై చర్చించామని త్వరలోనే పీలేరు నియోజకవర్గ సమస్యలతోపాటు వైకాపా పార్టీని బలోపేతం చేసి పార్టీ కార్యకర్తలలో నూతన ఉత్సాహం నింపేందుకు కార్యకర్తలతో కలుస్తారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పలువు నాయకులు పాల్గొన్నారు.

దళితుల సమస్యలు పరిష్కరించాలి

పీలేరు జూన్ 23 ప్రభాతవార్త :

పీలేరు నియోజకవర్గం కలికిరి మండల పరిధిలోని ఉన్న దళితుల సమస్యలు పరిష్కరించాలని మాల మహానాడు నాయకులు కలికిరి డిప్యూటీ తహసిల్దార్ కు వినతి పత్రం సమర్పించారు. సోమవారం మాల మహానాడు నాయకులు బృందం డిప్యూటీ తహసిల్దార్ తో చర్చించి వినతి పత్రాన్ని సమర్పించడం కాకుండా ఆయన బదిలీపై కలికిరిలో బాధ్యతలు తీసుకోవడంతో ఆయనను ఘనంగా సత్కరించి శాలువులతో సన్మానించినట్లు మాల మహానాడు నాయకులు తెలిపారు కార్యక్రమంలో మాల మహానాడు రాయలసీమ కన్వీనర్ చంద్రయ్య గుండ మనోహర్ రాష్ట్ర మాల మహానాడు అధికార ప్రతినిధి హరి తర మాల మహానాడు నాయకులు పాల్గొన్నారు.

ముద్దనూరు తాసిల్దార్‌గా అలీ ఖాన్

ముద్దనూరు, జూన్ 23, ప్రభాతవార్త:

మండల తహసిల్దార్ కార్యాలయంలో త్వరలో ఎండి అలీ ఖాన్ రెగ్యులర్ ఎమ్మార్వోగా విధులలో చేరబోతున్నట్లు ఉన్నతాధికారుల ఆదేశాలు జారీ చేశారు. గత కొద్ది నెలలుగా ఇంచార్జ్ తహసిల్దార్‌గా వరద కిషోర్ రెడ్డి బాధ్యతలు చేపడుతున్నాడంతో అధికారులు బదిలీలలో భాగంగా కడప తాసిల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఎండి అలీఖాన్ మండల తహసిల్దార్ గా బాధ్యతల స్వీకరించినున్నట్లు జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ నుంచి ఉత్తర్వులు అందాయి. త్వరలో తాసిల్దార్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు.

స్మశాన వాటికలు వంకలు దురాక్రమణపై ఫిర్యాదు

పీలేరు జూన్ 23 ప్రభాతవార్త :

వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

పీలేరు తహసిల్దార్‌కి అఖిలభారత మాల సంఘాల జేఏసీ నాయకులు ఫిర్యాదు చేశారు. అన్నమయ్య జిల్లా పీలేరు మండలం దొడ్డిపల్లి పంచాయతీ బండ మీద దళితవాడ గ్రామానికి దక్షిణ భాగాన పడమర నాగప్ప చెరువు ఉన్నది నాగప్ప చెరువు నుండి మరో కాలువ పెంచా నదిలోకి కలుస్తుంది. గతంలో 2021, 22 సంవత్సరంలో కొంతమంది అగ్రకులస్తులు పూర్తిగా వంక పసల మంద కబ్జా చేసినారు వర్షాలు కురిస్తే బండమీద హరిజనవాడ పూర్తిగా ముంపుకు గురి అవుతుంది గతంలో రెవెన్యూ వారికి ఎన్నో దపాలుగా ఫిర్యాదు చేయడం జరిగినది కానీ ఎటువంటి స్పందన రాలేదు. బాలం వారి పల్లి పంచాయతీ నాలే వాండ్లపల్లి ఎస్సీ కాలనీ కాలనీకి దొడ్డిపల్లి పంచాయతీ సరిహద్దు పంచాయతీగా కాను 70 సెంట్లు దొడ్డిపల్లి పంచాయతీలో రెవెన్యూ వారు స్మశానానికి కేటాయించబడినది కావున ఇప్పుడు కొంతమంది దురాక్రమించడం జరిగినది. గోడరేవుపల్లి పంచాయతీ సర్వే నెంబర్ 455 లో రెండు ఎకరాలు గోడరేవుపల్లి మాలపల్లికి ఎకరా స్మశానం వాటికకు ఎకరా డంపింగ్ యార్డ్ కు కేటాయించడం జరిగింది గతంలో ప్రజాప్రతినిధులు ఆ స్మశాన వాటికలో మట్టి తవ్వకాలు చేసి దౌర్జన్యముగా పూర్తిగా మట్టిని తవ్వేశారు కింద పూర్తిగా బండ ప్రాంతం ఏర్పడింది కావున మాకు గూడరేవుపల్లి మాలపల్లికు తక్షణం పరిశీలించి మాకు వేరేచోట స్మశానమునకు స్థలం కేటాయించాల నీ గతంలో ఎన్నో మార్లు ఫిర్యాదు చేసిన స్పందన రాని కారణంగా ఇకనైనా సమస్యను పరిగణలోకి తీసుకొని దళిత సమస్యలు పరిష్కరిస్తారని అఖిలభారత మాల సంఘాల జేఏసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు గుర్రం నారాయణ తాసిల్దార్‌కి తెలియజేశారు.. ఇంకా జ్ఞానదల పంచాయతీ పెద్ద హరిజనవాడ, చీరపరెడ్డిగారిపల్లి దళితవాడ ఈ గ్రామాలలో ఇంతవరకు స్మశాన వాటికలు లేవు కావున తాసిల్దారు తక్షణం స్పందించి నేను పరిష్కరిస్తానని అఖిలభారత మాల సంఘాల జేఏసీ నాయకులకు హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో ఎంఎం ఐక్యవేదిక పీలేరు మండల అధ్యక్షులు చీకటిపల్లి మల్లికార్జున ఏ బి ఎమ్మెస్ జేఏసీ జిల్లా నాయకులు మధ్యలో రమేష్ పల్లం నాగరాజు జి సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మి చెన్నకేశవ స్వామి వార్షికోత్సవ వేడుకలు

సిద్ధవటం జూన్ 23 ప్రభాతవార్త

మండలంలోని వంతాటిపల్లి గ్రామం లంకమల అభయారణ్యంలో వె

అభివృద్ధికి పదివేల కోట్లు కేటాయించాలి

రాజంపేట జూన్ 23 ప్రభాతవార్త

అన్నమయ్య జిల్లా సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పదివేల కోట్లు కేటాయించాలని సిపిఐ డిమాండ్ చేసింది. పాలకులు ఓట్లు సీట్ల తప్ప జిల్లా అభివృద్ధి పట్టదా అని ప్రశ్నించింది.జిల్లాలో అన్ని ఉన్నా అభివృద్ధి మాత్రం శూన్యమని విమర్శించింది. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.ధర్నా ఉద్దేశించి సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.మహేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు తుమ్మల రాధాకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమలు మూతపడడమే తప్ప నూతనంగా వచ్చినవి లేవన్నారు.జిల్లాలో సహజ వనరులు, హార్టికల్చర్, విహార ప్రదేశాలు చాలా ఉన్నప్పటికీ అభివృద్ధికి మాత్రం చాలా దూరంలో ఉన్నదన్నారు. జిల్లాలో గతంలో నందలూరులో ఉన్నటువంటి రైల్వే,ఆల్విన్ పరిశ్రమలు, కోడూరు లోని అప్సా జ్యూస్ పరిశ్రమ, సిటిఎం స్పిన్నింగ్ మిల్ ,పీలేరు లో నూనె విత్తల కర్మాగారం జిల్లాలో చాలా ప్రాంతాలల్లో పాల పరిశ్రమలు మూతపడ్డాయన్నారు. ఇవన్నీ మూతపడడం ద్వారా వేలాది మంది కార్మికులు ఆ పరిశ్రమల ఆధారంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్నటువంటి అనేకమంది కూడా ఉపాధిని కోల్పోయారని మండిపడ్డారు. నీటిపారుదల ప్రాజెక్టులు గత మూడు దశాబ్దాలుగా రైతులను ఊరిస్తున్నటువంటి గాలేరు నగరి కి నిధులు కేటాయింపు లేక అది పూర్తి కాక రైతులకు నీరు పుష్కలంగా అందడం లేదన్నారు. హంద్రీనీవా ప్రాజెక్టు పనులు నత్తనడకగా నడుస్తున్నాయన్నారు. మరోవైపు ఇసుకాసురుల ధన దాహానికి వరద పాలైపోయిన అన్నమయ్య ప్రాజెక్టు నిర్మాణం ఇంకా నిపుణుల కమిటీ పేరుతో కాలయాపన జరుగుతున్నదన్నారు. దాని ప్రభావం సుమారు నాలుగు మండలాల రైతులకు నీరు అందక బోర్లు ఎండిపోతు పంటలు పండించే పరిస్థితి లేకుండా పోతోందన్నారు. రైతులకు నీరు అందడం లేదని, జురికోన ప్రాజెక్టు పరిస్థితి అలాగే ఉన్నది ఇంకా చిన్న చిన్న ప్రాజెక్టుల పరిస్థితి అత్యంత దారుణంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కోడూరు నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య సిపిఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి సిజి చెన్నయ్య కాంగ్రెస్ పార్టీ రాజంపేట ఇన్చార్జ్ పూల భాస్కర్ కోడూరు నియోజవర్గ ఇన్చార్జ్ గోశాల దేవి ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు గంగాధర్ సహాయ కార్యదర్శి మురళి, ఈ సికిందర్,ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సరోజనమ్మ ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు నాగేశ్వరరావు,బి కే యం యు జిల్లా ఉపాధ్యక్షులు జయరాం సిపిఐ మండల కార్యదర్శులు నాగమ్మ, ఆదినారాయణ, సెల్వ కుమార్, పార్టీ ప్రజా సంఘాల నాయకులు పరమయ్యగారి సుబ్రహ్మణ్యం, రమణ పెంచలయ్య జమాల్ భాషా, సాయి, వెంకటేష్, బాబాజాన్ లక్ష్మీనారాయణ శివయ్య రాజశేఖర్ వెంకటరమణ రోజమ్మ బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు భరోసా ముఖ్యమంత్రి సహాయనిధి

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న జగన్ రాజు, టిడిపి నేతలు

రాజంపేట జూన్ 23 ప్రభాతవార్త :

పేదలకు భరోసా ముఖ్యమంత్రి సహాయనిధి అని టిడిపి జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్ రాజు అన్నారు. సోమవారం డి మార్గంలో ఏడు మందికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పార్టీ నాయకులతో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు అండగా ఉండే ఏకైక ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.జడ ప్రసన్న 8,54,830 రూపాయలు, పి. ఇంద్రావతి 4,20,806, ఎల్ సుబ్రహ్మణ్యం రాజు 57,266, సి. చలపతి 41,000, ఈశ్వరమ్మ 1,50,000, నన్నపనేని రామయ్య 40,000, అనిల్ కుమార్ 43541, షేక్ జరీనా బేగం 24346 రూపాయల సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ చికిత్స కోసం అప్పులు చేసి ఇబ్బందులు పడుతున్నామని, అలాంటి మాకు ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి సహాయ నిధి నీ అందించి అండగా నిలిచినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, పార్లమెంట్ అధ్యక్షులు జగన్మోహన్ రాజుకి ధన్యవాదాలు తెలియజేశారు.

బెల్టుషాపుల్లో మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకోండి

ఎక్సైజ్ పోలీసులకు ఎమ్మెల్యే సూచన

ఎమ్మెల్యేకి ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

మదనపల్లె, జూన్ 23 ప్రభాతవార్త :

మద్యం బహిరంగ ప్రదేశాల్లో విక్రయించినా, బెల్టుషాపుల ద్వారా మద్యం విక్రయాలు జరిపి మహిళలకు ఇబ్బందికరంగా మద్యం సేవించే వారిపై చర్యలు తీసుకోవాలంటూ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఎక్సైజ్ పోలీసులకు సూచించారు. నక్కలదిన్నె సమీపంలోని ఓ మద్యం షాపు యజమాని మహిళలకు ఇబ్బందికరంగా ఉండేలా మద్యం విక్రయిస్తూ పక్కనే మద్యంను సేవిస్తూ పలువురికి ఇబ్బందికరంగా ఉండడాన్ని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీంతో సోమవారం ఆయన మద్యం షాపు వద్దకు ఎక్సైజ్ పోలీసులతో కలసి వెళ్ళి మహిళలు చేసిన ఫిర్యాదును విచారించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎక్కడా కాని మద్యం షాపు యాజమాన్యాలు మహిళలకు ఇబ్బందికరంగా మద్యాన్ని విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ పోలీసులను ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే మద్యం విక్రయాలు జరపాలన్నారు. తొలుత ఎమ్మెల్యే నివాసం వద్ద ప్రజాసమస్యలపై ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు సమస్యలను అర్జీల రూపంలో ఎమ్మెల్యేకు విన్నవించారు. బసినికొండ పంచాయితీ మొరపపల్లె గ్రామంలనో 25కుటుంబాల ప్రజలకు ఆధార్‌కార్డు గత 15ఏళ్ళుగా లేదని ఎమ్మెల్యేకు విన్నవించడంతో వెంటనే స్పందించి ఆ గ్రామంలో క్యాంపు నిర్వహించి ప్రతి ఒక్కరికి ఆధార్‌కార్డు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టౌన్‌బ్యాంకు ఛైర్మెన్ నాదేళ్ళ విద్యాసాగర్, సీతక్క, యుగంధర్, ప్రసాద్, గట్టురమణ, జేసిబి వేణు, ఎమ్మార్పీఎస్ వాసు, రఘుపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైయస్ అవినాష్‌రెడ్డి అనుచరులపై కేసు నమోదు

ముగ్గురికి 41 ఏ నోటీసులు జారీ

పులివెందుల,జూన్ 23,ప్రభాత వార్త:

మాజీమంత్రి వైయస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో ఏ 2 నిందితుడు సునీల్ కుమార్ యాదవ్ ను కారులో వెంబడించారని సునీల్ యాదవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కడప పార్లమెంటు సభ్యులు వైయస్ అవినాష్ రెడ్డి పీఏ పల్లా.లోకేష్ రెడ్డి, సోషల్ మీడియా కార్యకర్త ముతుకూరు పవన్ కుమార్ అండ్లూరు జయ ప్రకాష్ రెడ్డి లపై బీఎన్ ఎస్ చట్టం 351, ఐపీసీ సెక్షన్ 341, 506 రెడ్ విత్ 34 ఐపీసీ సెక్షన్ 126 సెక్షన్ కింద ఎస్సై విష్ణు నారాయణ కేసు నమోదు చేశారు. సోమవారం పులివెందుల లోని అర్బన్ స్టేషన్ నందు మీడియాతో వైఎస్ వివేకా కేసు సిట్ అధికారి ఉలసయ్య మాట్లాడుతూ ఈనెల 21వ తేదీన సునీల్ కుమార్ యాదవ్ పెళ్లిరోజు సందర్భంగా సాయంత్రం కుటుంబ సభ్యులతో కలిసి పట్టణంలోని శ్రీకృష్ణ దేవాలయం దర్శనానికి వెళ్లి వస్తుండగా సునీల్ కుమార్ యాదవ్ ను పవన్ , లోకేష్ లు వెంబడించి తమ వాహనాన్ని అడ్డుకోవడం జరిగిందని సునీల్ ఫిర్యాదు లో పేర్కొనడం జరిగింది అన్నారు. హత్య సినిమా లో సునీల్ ను తన తల్లిని అసభ్యకరంగా చిత్రీకరించడం జరిగిందని గతంలో సునీల్ ఫిర్యాదు చేశానన్నారు. ఈ ఫిర్యాదు కారణంగా సునీల్ ను బెదిరించడం జరిగిందని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.సోమవారం సాయంత్రం ఎంపీ పిఏ లోకేష్ రెడ్డి తో పాటు, పవన్ కుమార్ జయ ప్రకాష్ రెడ్డి లను స్టేషన్ కు పిలిపించి విచారణ చేసి వారిచ్చిన వాంగ్మూలాన్ని నమోదు చేసి వారికి 41 ఏ నోటీసులు పోలీసులు జారీ చేయడం జరిగింది.

ప్రజల సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలి

రాయచోటి, జూన్ 23 ప్రభాతవార్త

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రజల సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలని డిఆర్ఓ మధుసూదనరావు అధికారులను ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో సోమవారం జిల్లా డిఆర్ఓ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారం పై నేరుగా పర్యవేక్షణ చేయడం జరుగుతోందన్నారు. ప్రతి సమస్యను మరియు ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్ ను ప్రభుత్వం సీరియస్ గా పరిశీలిస్తుందని, కాబట్టి అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను నూరు శాతం పరిష్కరించాలన్నారు. ఇప్పటికే పెండింగ్లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఏ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలన్నారు. సమస్యను పట్టుకొని పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యను సావధానంగా వినాలన్నారు. సమస్య ఏమిటి, దానిని ఎలా పరిష్కరించాలన్న విషయాలపై అధికారులకు అవగాహన ఉండాలని, చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలని డిఆర్ఓ పేర్కొన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. అర్జీదారులకు స్నాక్స్, వాటర్ బాటిల్, టీ సౌకర్యాలను కల్పించిన డిఆర్ఓ ఎన్నో వ్యయ ప్రయాసలతో, సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రం రాయచోటికి వచ్చిన అర్జీదారులకు డిఆర్ఓ స్నాక్స్, వాటర్ బాటిల్, టీ సౌకర్యాలను కల్పించారు. అర్జీ దారులు ఈ సౌకర్యాలను వినియోగించుకొని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏడి సర్వే భరత్ కుమార్, జిఎస్డబ్ల్యూఎస్ శాఖ జిల్లా అధికారి లక్ష్మీపతి, ఎస్డిసి రాఘవేంద్ర, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బనకచర్ల కంటే ముందు హంద్రీనీవా, వంశధారలను పూర్తి చేయాలి.

తెలుగు రాష్ట్రాల సీఎంలు సమస్యను పరిష్కరించుకోవాలి

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు విజయ జ్యోతి

కడప, జూన్, 23 ప్రభాతవార్త :

రెండు తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్ గా మారిన బనకచర్ల ప్రాజెక్టుపై కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు విజయ జ్యోతి స్పందించారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఇందిరా భవన్ లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బనకచర్ల ప్రాజెక్టు కంటే ముందు హంద్రీనీవా, వంశధారా లాంటి ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూర్చొని సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. రెండు రాష్ట్రాలకు ఎటువంటి అభ్యంతరాలు లేకుండా ప్రాజెక్టులను కట్టుకుంటే మంచిదని ఇరు రాష్ట్రాల సీఎంలకు సూచించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటనను స్వాగతిస్తున్నట్లు విజయ జ్యోతి పేర్కొన్నారు. కేంద్రంతో చర్చించి సమస్యను పరిష్కరించుకుంటామని రేవంత్ రెడ్డి అన్నారని.. వెనుకబడిన ప్రాంతాలకు నీరు అందే విధంగా ప్రభుత్వాలు కృషి చేయాలని విజయ జ్యోతి అన్నారు.. ప్రాజెక్టుల నిర్మాణం కోసం కేంద్రం సహాయం తీసుకోవాలని... కానీ కొంతమంది ప్రాంతీయ ధోరణితో రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని విజయ జ్యోతి మండిపడ్డారు.. రాష్ట్రాలు రెండుగా విడిపోయినంత మాత్రాన తెలుగు వాళ్ళు తెలుగు వాళ్ళు శత్రువులు కాదన్నారు. ఎవరికి నష్టం లేని పద్ధతిలో పరిష్కారం చేసుకుంటే మంచిదని విజయ జ్యోతి రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు విజ్ఞప్తి చేశారు.విలేకరుల సమావేశంలో డిసిసి ఉపాధ్యక్షులు సిరాజుద్దీన్, డిసిసి ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్ పీర్, పులివెందుల, కమలాపురం నియోజకవర్గ కోఆర్డినేటర్లు ధ్రువ కుమార్ రెడ్డి, అశోక్ కుమార్ రెడ్డి, మైనార్టీ జిల్లా అధ్యక్షులు రహమతుల్లా ఖాన్, కేకేసి జిల్లా ఉపాధ్యక్షులు ఫై రోజు హుస్సేన్, మైనార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ నీలం, మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమాల్ భాష, సిద్ధిక్ పాల్గొన్నారు.

అగస్త్యేశ్వర స్వామికి ఆర్జిత కళ్యాణం

ప్రొద్దుటూరు అర్బన్, జూన్ 23, ప్రభాతవార్త :

స్థానిక అగస్త్యేశ్వరాలయంలో సోమవారం మాసశివరాత్రి మహా పర్వదినం సందర్భంగా గంగా గౌరీ సమేత అగస్త్యేశ్వర స్వామికి ఆర్జిత కళ్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుండే స్వామి వారికి రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు, ఉదయం ఆరు గంటలకు గోపూజ, గణపతి, నవగ్రహ, ఉపగ్రహ, రుద్ర హోమాలు, తదనంతరం సాయంత్రం స్వామి, అమ్మవార్లకు ఆర్జిత కళ్యాణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి మరియు సహాయ కమిషనర్ జే.వెంకటసుబ్బయ్య, అర్చకులు, వేద పాఠశాల గురువు, వారి శిష్య బృందం పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్స్

ఖాజీపేట, జూన్ 23, ప్రభాతవార్త:

మండల పరిధిలోని పుల్లూరు ఎంపీపీ స్కూల్ నందు విధ్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ మిత్ర స్టూడెంట్స్ కిట్స్‌ను టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు, తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త పల్లె గంగాధర్ సోమవారం అందజేశారు. ఈ సంధర్భంగా పల్లె గంగాధర్ మాట్లాడుతూ విధ్యార్థులందరికి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జీవితం ఆదర్శం కావాలని, చదువుకునే ప్రతి విధ్యార్థికి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి జీవితం ఆదర్శకంగా తీసుకొని వారి వారి ఉన్నతికి చేరుకోవాలి అని ఆకాంక్షించారు. ఒక ఉపాధ్యాయునిగా తన జీవితాన్ని ప్రారంభించిన ఆ మహా నాయకుడు మన దేశంలో ఉప రాష్ట్రపతి స్థాయికి ఎదిగి దేశానికి ఎనలేని సేవలందించారన్నారు. పట్టుదల, అంకితభావంతో పనిచేసిన ఆయన అంత ఉన్నత స్థితికి చేరుకున్నారని మీరు కూడ చదువుకునే వయసులోనే లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని నెరవేర్చుకోవాలనే దృఢ సంకల్పంతో కృషి పట్టుదలతో ఉన్నతికి చేరుకునేందుకు పాఠశాలను వేదికగా చేసుకొని లక్ష్యాలను చేరుకోవాలని పిలుపునిచ్చారు. అందుకు పాఠశాలలో వచ్చే ప్రతి అవకాశాన్ని మన కూటమి ప్రభుత్వం అందించే ప్రతి సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో కూడ నేడు కార్పొరేషన్ స్థాయికి ధీటుగా మంచి విద్యా ప్రమాణాలు పాటిస్తూ విధ్యార్థుల ఉన్నతికి కృషి చేస్తున్నారని తెలిపారు. విధ్యార్థులు కూడ ఉపాధ్యాయుల సేవలను సద్వినియోగం చేసుకొని మంచి ఉత్తీర్ణత సాధించేందుకు మీ వంతు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాల ఓబుళ్ రెడ్డి, పద్మావతి, స్కూల్ కమిటీ చైర్మెన్ పుల్లూరు సుధాకర్, వైస్‌చైర్మెన్ డి.సుశీల మరియు పాఠశాల విధ్యార్థిలు, పుల్లూరు ప్రజలు పాల్గొన్నారు.

గ్రామ సర్వేయర్ల సమస్యల పరిష్కారానికి తగిన మార్గం చూపాలి



తహశీల్దారు కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామ సర్వేయర్లు

పీలేరు జూన్ 23 ప్రభాతవార్త :

గ్రామ సర్వేయర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తగిన మార్గాలు చూపాలని పీలేరు మండల సర్వేయర్లు తెలిపారు. సోమవారం వారు స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలిపి, తహశీల్దారు శివకుమార్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ గ్రామ సర్వేయర్ల సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పలుమార్లు, గ్రామ సర్వేయర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ పెద్దలు, అధికారులకు విన్నవించుకున్నా వారి నుంచి స్పందన కరువైందన్నారు. 4,722 మంది మిగులు సిబ్బంది అయిన గ్రామ సర్వేయర్ల భవిష్యత్తుపై సమగ్ర నివేదిక సమర్పించాలని, జీవో నెంబర్ 161 ప్రకారం గ్రేడ్ 3 నుండి గ్రేడ్ 2లుగా హోదా మార్చినందున, పే స్కేల్ లో తగిన మార్పులు చేయాలని, అన్ని జిల్లాల్లో సీనియారిటీ జాబితాలను వెంటనే పబ్లిష్ చేయాలని, గ్రేడ్ 1 కేడర్లను ఫైనల్ చేయాలని, అర్హత కలిగిన వారందరికీ ఉద్యోగోన్నతులు పొందేలా సర్వీస్ రూల్స్ లో తగిన మార్పులు చేయాలని, ఇప్పటివరకు జరిగిన రీ సర్వే పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తహశీల్దార్లకు జిల్లా కార్యవర్గ సభ్యులు అందరూ రాష్ట్ర కార్యవర్గం తీసుకున్న నిర్ణయాలకు మద్దతుగా ఉంటూ మంగళవారం నుంచి తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కారం అయ్యే వరకు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరు కావాలని నిర్ణయించుకున్నారు. తమ డిమాండ్లను అర్థం చేసుకుని ఆంధ్రప్రదేశ్ గ్రామ సర్వేయర్ల సంఘానికి సహకరిస్తారన్న ఆశాభావంతో తామున్నామని అన్నారు. లేనిపక్షంలో ఈనెల 25 నుంచి రిలే నిరాహార దీక్ష హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల పరిధిలోని గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

టీబీ ముక్త్ భారత్ అభియాన్ విజయవంతం చేద్దాం

కలికిరి, జూన్ 23, ప్రభాతవార్త:

టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని మేడికుర్తి పీహెచ్‌సీ వైద్యులు డా.కావ్యగంధ అన్నారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ వంద రోజుల కార్యక్రమంలో భాగంగా చెరువుముందరపల్లి గ్రామంలో నిర్వహిస్తున్నట్లు 104 సేవలలో డీఎంహెచ్ఓ వారి ఆదేశాల మేరకు డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ మంరియు టీబీ పర్యవేక్షకులు నాగిరెడ్డి, టీబీ వ్యాధిపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి పొగతాగే వారిని, మద్యం సేవించే వారిని గతంలో టీబీ జబ్బు వచ్చి బాగు అయిన వారిని, హెచ్ఐవీ పాజిటీవ్, బీఎంఐ 18 కంటే తక్కువ ఉన్న వారిని,గర్భవతులను, సుగర్ ఉన్న వారిని గుర్తించి వారికి గల్ల పరీక్షలు నిర్వహించి పాజిటీవ్ వచ్చిన యెడల ఆరు నెలల చికిత్స ఉచితంగా ప్రారంభించడం జరుగుతుందన్నారు. చికిత్స సమయంలో రోగి ఖాతాలో రూ.వెయ్యి జమ చేయడం జరుగుతుందని తెలిపారు. మంచి పౌష్టికాహారం తీసుకోవడం కోసం ఈ పైకం వారికి ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శన చేస్తూ ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహ్మద్ రఫీ, ఎస్టీఎస్ నాగిరెడ్డి, సీహెచ్ఓ నాగరాణి, ఏఎన్ఎం నఫీసా, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాలలో సమస్యలపై అవేర్నెస్ ప్రోగ్రాం

మైదుకూరు, జూన్ 23, ప్రభాతవార్త:

మున్సిపాలిటీ పరిధిలోని కృష్ణాపురం గ్రామంలో మైదుకూరు అర్బన్ సీఐ కె రమణారెడ్డి ఆధ్వర్యంలో గ్రామ ప్రజలతో ముచ్చటించారు. గ్రామంలో ఏమైనా సమస్యలు పై ఇబ్బందులు ఉంటే మా దృష్టికి తెలపాలని గ్రామ మహిళలు, పెద్దలు, యువకులతో మాట్లాడారు. అంతేకాకుండా చెడు వ్యసనాలకు, గలాటలు, కుటుంబ సమస్యలు, ఇలాంటి వాటికి దూరంగా ఉండాలని గ్రామ ప్రజలంతా ఐక్యంగా ఉంటూ గ్రామ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. గ్రామ స్థాయిలో ఏదైనా సమస్య ఉన్న, కొత్త వారితో ఇబ్బందులు, దొంగతనాలు, అనుమానం ఉన్న పోలీసులకు సమాచారం అందించాలని గ్రామంలో అందరికీ తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

యువత .. సమాజానికి ఆదర్శం కావాలి

ఓబులవారిపల్లి జూన్ 23, ప్రభాతవార్త:

నేటి పిల్లలే రేపటి పౌరులు అనే విషయం అందరికీ తెలిసిందే కానీ యువత బాగుంటే దేశం భవిష్యత్తు అంచలంచులుగా అభివృద్ధి చెందడంతో పాటు భావితరాల పౌరులకు ఆదర్శంగా నిలవచ్చు అదేవిధంగా యువత చెడు వ్యసనాలకు చెడు అలవాట్లకు చెడు అడ్డదారులు తప్పడంతో యువత భవిష్యత్తు అర్థ రహితంగా మారి యువత మత్తుకు చిత్తవుతుందని అలా కాకుండా యువకులు మారాలి భావితరాలకు సమాజంలో మార్గదర్శకాలుగా చూపి మంచి నడవడికతో ప్రతిభ పట్ల మక్కువ చూపి బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఓబులవారిపల్లి ఎస్సై హితోపలికారు సోమవారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్లో ప్రభాతవార్తతో మాట్లాడుతూ యువత నేటి సమాజానికి ఆదర్శం కావాలని యువకులు మారాలని యువత మత్తుకు చిత్తు కాకుండా పునరాలోచించి మంచి భవిష్యత్తు కోసం ఆరాటపడి పట్టుదల కృషితో వారి వారి నైపుణ్యం విద్యలో రాణించి ప్రతిభకు పట్టం కట్టే విధంగా పెద్దల సలహాలు సూచనలు తీసుకొని ఉపాధ్యాయులు అధ్యాపకులు మార్గదర్శకాలుగా వారి వారి పనులలో నిమగ్నమై వారి విద్యా ఉద్యోగాలలో నైపుణ్యం సాధించి భవిష్యత్తు తరాలకు ఒక మార్గదర్శకం చూపే విధంగా బదుగురు మెచ్చే విధంగా జీవించాలని ఆయన సూచించారు ఎక్కడైనా వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు ఎటువంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు లోను కాకుండా గ్రామాలలో శాంతియుత వాతావరణ నెలకొల్పి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు.

సొంత మండలాలలో పోస్టింగ్ ఇవ్వాలి

దువ్వూరు, జూన్ 23, ప్రభాతవార్త:

సచివాలయాల్లో పనిచేస్తున్న గ్రామ సర్వే ఉద్యోగులకు సొంత మండలాలలోనే పోస్టింగ్ అవకాశం కల్పించాలని మండలంలోని సచివాలయ సర్వేయర్లు సోమవారం స్థానిక ఎంపీడీఓ రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సంధర్భంగా మండలంలోని విలేజ్ సర్వేయర్లు మాట్లాడుతూ తాము ఎదుర్కొంటున్న సమస్యలపై పలు మార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయిన గత 5సంవత్సరాలుగా పరిష్కారం లేదన్నారు. రిజలైజేషన్, ట్రాన్స్ఫర్‌ల ప్రక్రియ అమలు చేయు విధానంలో సర్వే ఉద్యోగులకు ఎక్కువ నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ విశయంలో పలుమార్లు నిరసన ర్యాలీలో కూడ తెలియజేశామన్నారు. అయితే ఇంతవరకు ఎటువంటి పరిష్కారం కాలేదన్నారు. ఇటివల గ్రామ సచివాలయాలను హేతుబద్ధీకరణ చేస్తున్నారని అందులో భాగంగా జనాభా ప్రాతిపదికన కాకుండా రెవెన్యూ విలేజ్ విస్తరణ మేరకు హేతుబద్ధీకరణ చేయాలని సర్వేయర్లు డిమాండ్ చేశారు. అలాగే బదిలీలను ప్రమోషన్ కల్పించి చేయాలన్నారు. గ్రామ సర్వేయర్లకు విధులకు ఆటంకం కలగకుండా బాధ్యతలు చేపట్టే విధంగా చూడాలని కోరారు. ఇంకా పలు సమస్యలపై వినతిపత్రంలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్లు పాల్గొన్నారు.



తహశీల్దారుకు వినతి పత్రం సమర్పిస్తున్న గ్రామ సర్వేయర్లు

రైతన్నలకు అండదండ పీఎం కిసాన్ డ్రోన్ శక్తి పథకం

ఏపి మార్క్ ఫెడ్ డైరెక్టర్ వంగల శశిభూషణ్ రెడ్డి

**పులివెందుల,జూన్ 23, ప్